సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 17.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 145
పేజీలు: 12 వెల: రూ. 5


## పట్టణ పేదలకు
# గుడ్ న్యూస్

20 వేల ఇళ్లకు గ్రీన్ సిగ్నల్,
త్వరలోనే కేటాయింపు, నిధులు విడుదల

09



## కల సాకారం దిశగా
# తెలంగాణ

### సమగ్ర, సమ్మిళిత, సమగ్ర అభివృద్ధికి ఘన ప్రణాళికలు

- బలహీన వర్గాలకు భరోసాగా ప్రపంచానికి ఆదర్శంగా పథకాలు
- ప్రజలకు అవకాశాలు సృష్టిస్తోన్న పాలసీ, కార్యక్రమాలు
- ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణ
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం
- ప్రారంభమైన తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. సోమవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో తొలిరోజు సభకు హాజరైన సభ్యులందరికీ గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒక చారిత్రక మార్పు దశలో తెలంగాణ నిలబడిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఎంచుకునే ప్రతి పాలసీ, అమలు చేసే ప్రతి కార్యక్రమం, చేపడుతున్న ప్రతి సంస్కరణ ఈ ప్రాంత ప్రజలకు అవకాశాలను సృష్టిస్తోందన్నారు. సమ్మిళిత వృద్ధి దిశగా వారిని నడిపించి మరింత శక్తివంతులుగా తయారు చేస్తుందన్నారు. రాష్ట్ర సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధిపై ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉందన్న గవర్నర్.. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరని వ్యాఖ్యానించారు.



ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అందుకోసం బలమైన పునాదులు వేసేందుకు ఏడాది కాలంలో ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిందన్నారు. ఆర్థిక వ్యవస్థను బలో పేతం చేయడానికి గడిచిన రెండేండ్లుగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్న ఆయన నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు. సమున్నతమైన ఆశయంతో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు. మిగతా 02లో

## మమతా బెనర్జీకి
# ఈసీ షాక్

ఎన్నికల వేళ సీఎస్, డీజీపీ సహా పలువురు ఉన్నతాధికారుల తక్షణ బదిలీ

- దుష్యంత్ నరియాలా కొత్త సీఎస్.. సిద్ధ్ నాథ్ గుప్తా డీజీపీగా నియామకం
- కోల్‌కతా పోలీస్ కమిషనర్ సహా మరికొందరు అధికారుల మార్పులు
- ఎన్నికలు పూర్తయ్యే వరకు బదిలీ అయినవారికి ఎలాంటి ఎన్నికల బాధ్యతలు వద్దని ఈసీ ఆదేశం

10




అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుసటి రోజే కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై కొరడా ఝుళిపించింది. రాష్ట్రంలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా, కీలక అధికారులను తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. డీజీపీ, సీఎస్‌లతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఈసీ జారీ చేసిన ఉత్తర్వులు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

## చాక్లెట్ ఆశచూపి
# లైంగికదాడి

నార్సింగిలో దారుణం


- సాయంత్రం నుంచి తల్లిదండ్రులకు కనిపించని బాలిక
- సీసీ కెమెరాలతో బయటపడ్డ నిందితుడు
- వెంటనే అరెస్ట్ చేసిన పోలీసులు
- ఉదయం వెలుగులోకి వచ్చిన దారుణం

03



# 20న బడ్జెట్

30 వరకు అసెంబ్లీ, 23 నుంచి వివిధ శాఖల పద్దులపై చర్చలు



- నేడు, రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సీఎం సమాధానం
- 19న ఉగాది పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు
- ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్ మెట్రో విస్తరణపై కీలక చర్చ
- ఆరు గ్యారంటీల అమలు కోరుతూ గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆందోళన
- వందేమాతరం గీతాలాపనను నిరసిస్తూ ఎంఐఎం వాకౌట్
- ఎంఐఎం ఎమ్మెల్యేల తీరుపై బీజేపీ శాసనసభాపక్షం నిప్పులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ సమావేశాలను మార్చి 16 నుంచిమార్చి 30వ తేదీ వరకు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. నేడు, రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సీఎం సమాధానం ఉం డనుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మరుసటి రోజు 20న ఆర్థిక మంత్రి భట్టి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడతారు. 23 నుంచి శాఖల పద్దులపై చర్చలు ప్రారంభమవుతాయి. 30న ఆమోదం పొందిన తర్వాత మిగతా 02లో

## తెలంగాణలో వైద్య రంగంలో
# సంస్కరణలు

నకిలీ డాక్టర్లకు చెక్.. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ఇక ఆన్‌లైన్‌లోనే




- ప్రైవేటు హాస్పిటళ్లపై కఠిన నిబంధనలు.. ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం
- ఫేక్ క్లినిక్‌లపై ప్రభుత్వం కఠిన చర్యలు
- హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరి రిజిస్ట్రేషన్
- డాక్టర్లు, సేవలు, ఛార్జీలు అన్నీ ఆన్‌లైన్‌లో వెల్లడించాలి
- పైలట్‌గా సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో ప్రారంభం

09

# ఆస్కార్
## అవార్డుల పంట

వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ మూవీ హవా

- ఆరు అవార్డులతో టాప్‌లో నిలిచిన హాలీవుడ్ మూవీ
- సిన్నర్స్‌కు నాలుగు అవార్డులు
- బెస్ట్ యాక్టర్‌గా మిచెల్ బి.జోర్డాన్
- బెస్ట్ డైరెక్టర్‌గా పాల్ థామస్ ఆండర్సన్
- నామినేషన్లతోనే సరిపెట్టుకున్న భారతీయ సినిమాలు

10



# సీఎం మారిపోయారు!

ఆవేశం నుంచి ఆలోచనల దిశగా..!

■ సీఎం బాధ్యతతో మారిన మాటతీరు ■ రేవంత్ రెడ్డి నయా పాలిటిక్స్ ■ ఘాటు భాష లేని హైక్వాలిటీ రాజకీయం ■ విమర్శలకు బదులు సూచనలు

02





# ఊపిరి ఆడడం లేదు!


కరీంనగర్‌లో మళ్లీ కాలుష్య కోరలు

- మళ్లీ అంటుకున్న డంప్‌యార్డ్.. ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులు
- విషపూరిత కాలుష్యంతో చిన్నారులు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు
- అధికారుల నిర్లక్ష్యమే మంటలకు కారణమని స్థానికుల ఆరోపణలు
- బయో మైనింగ్ పనులు కొనసాగుతున్నా పరిష్కారం ఎప్పుడో అనిశ్చితం
- కనీసం తక్షణ చర్యలు తీసుకోవాలని నగరవాసుల ఆవేదన

03



## ఇదీ ఏఐ
# ముద్ర



ఈ ఉగాది నుంచి ప్రారంభమయ్యే శ్రీ పరాభవ నామ సంవత్సరంలో మంచి రోజులు, మౌఢ్యమి కాలాలు, వాస్తు కర్తరి, పుష్కరాలు, సంక్రాంతి వంటి వాటిపై అప్పుడే వెతుకులాట ప్రారంభమైంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17.03.2026
www.mudranews.in | @mudranews




## వడ్డీ రేట్లు : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




FD పై సుమారు 6.40% వరకు వడ్డీ లభిస్తోంది.సీనియర్ సిటిజన్లకు 7.05% వరకు వడ్డీ అందుతుంది.

# 20న బడ్జెట్




(మొదటి పేజీ తరువాయి)
సభ నిరవధికంగా వాయిదా పడుతుంది. పక్షం రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై సభలో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమావేశాలను మార్చి నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే సభలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీలో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించడాన్ని నిరసిస్తూ ఎంఐఎం సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయడం చర్చనీయాంశమైంది. గీతాలాపన జరుగుతున్న సమయంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ నేతృత్వంలో ఎమ్మెల్యేలు సభలోకి వెళ్లలేదు. దీనిపై బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందిస్తూ, వందేమాతరాన్ని గౌరవించకపోవడం దేశాన్ని అవమానించడమేనన్నారు. ఈ ఘటనతో అసెంబ్లీ లాబీల్లో రాజకీయ ఉద్రిక్తత పెరిగింది.

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ**

శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

అసెంబ్లీ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు ఆదేశించారు. సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశంలో సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సభకు గైర్హాజరు కాకూడదని హెచ్చరించారు. గత ప్రభుత్వ వైఫల్యాల కంటే భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి పెట్టాలని చెప్పారు.

**అసెంబ్లీ కమిటీలు పూర్తి స్థాయిలో**

అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాలను పర్యటించి ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సభ్యులకు సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలని చెప్పారు.

**ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ నిరసన**

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో వెంటనే చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిరసనల నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కేటీఆర్‌పై మంత్రి సీతక్క విమర్శలు**

రాహుల్ గాంధీని విమర్శిస్తే పెద్ద లీడర్ అవుతానని కేటీఆర్ భావిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

**మల్లారెడ్డి వ్యాఖ్యలు**

తాను కాంగ్రెస్‌లో చేరుతున్నాననే వార్తలను మాజీ మంత్రి మల్లారెడ్డి ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోతున్న నావలాంటిదని వ్యాఖ్యానించారు.

**ఇతర వ్యాఖ్యలు**

కేంద్ర మంత్రి బండి సంజయ్ తనను టార్గెట్ చేస్తే కరీంనగర్‌లో దళిత కవాతు నిర్వహిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు.

ప్రజాప్రతినిధులు కూడా ప్రతి 90 రోజులకు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు.

మంత్రి దామోదర రాజనర్సింహాకు అసెంబ్లీ వద్ద చిన్న అపశృతి జరిగింది. సీఎం వెళ్లే మార్గం అని చెప్పి సెక్యూరిటీ సిబ్బంది ఆయనను అడ్డుకోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బీజేపీ ప్రతిపక్ష పాత్ర**

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ వ్యవహరిస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలు, రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

**సీఎంపై హక్కుల ఉల్లంఘన నోటీసులు**

మూసీ ప్రాజెక్టు అంశంపై సభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తామని బీఆర్ఎస్ నేత హరీష్ రావు తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా పెడతామని చెప్పారు.

**గ్యారంటీలపై నిలదీస్తాం: కేటీఆర్**

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ఇప్పటికీ చట్టబద్ధత ఇవ్వలేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, పెన్షన్లు, ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా ఆరు

# కల సాకారం దిశగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

**అభివృద్ధికి వికేంద్రీకరణ వ్యూహం**

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అంచెలంచెలుగా వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరించిందని గవర్నర్ శుక్లా తెలిపారు. వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించిందని చెప్పారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం, పౌర సేవలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి తోడు కోర్ అర్బన్ రీజియన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించినట్లు గవర్నర్ తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులు, ట్యాంకులను పునరుద్ధరించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించిందన్న గవర్నర్...హైడ్రా ఏర్పాటు ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుందన్నారు.

**ఆధునిక నగరంగా హైదరాబాద్**

హైదరాబాద్‌ను ఆధునాతన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 55 కి.మీ. మేరకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టును చేపట్టిందని గవర్నర్ వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న ప్రాంతంలో (పెరి-అర్బన్ రీజియన్) మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎకో-ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్ కంపెనీలతో మౌలిక సదుపాయాల హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత కీలక గమ్యస్థానంగా నిలిచిందని చెప్పారు. ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్ నిర్వహించడంతో పాటు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల్లోని ప్రముఖులతో రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించిందన్నారు. ఎగుమతుల్లో తెలంగాణ దేశంలోనే 7వ స్థానంలో నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా రేడియల్ రోడ్లు, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణె నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లతో రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుందన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్

తెలంగాణ పురోభివృద్ధికి 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని గవర్నర్ వివరించారు. ఇంధన రంగంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 23,187 మెగావాట్లకు పెరిగిందన్న ఆయన..ఇందులో 44.55 శాతం పునరుత్పాదక వనరుల నుంచి రావడం ప్రశంసనీయమన్నారు.

**వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా రైతులు**

రైతులను వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను చేపట్టినట్లు గవర్నర్ వివరించారు. ఇందులో భాగంగా రూ. 20,616 కోట్ల పంట రుణాల మాఫీ, సన్నరకం వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్, పెట్టుబడి సహాయంగా రైతు భరోసా, గిట్టుబాటు ధరలకు ధాన్యం సేకరణ, సౌర శక్తితో నడిచే పంప్ సెట్లకు తీసుకుంటున్న చర్యలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూమి సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారానికి తెలంగాణ భూ భారతి చట్టం అమలులోకి తేవడంతో పాటు సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

**సంక్షేమానికి పెద్దపీట**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశ్యంతో ప్రతి కుటుంబానికి సంక్షేమంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు గవర్నర్ చెప్పారు. ఇందులో భాగంగా కొన్నేండ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేశామన్నారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి ప్రతి లబ్దిదారుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నట్లు వివరించారు. రూ. 22,500 కోట్లతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నామన్న గవర్నర్.. మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక బృందాలను వ్యాపారస్తులుగా మార్చేందుకు వేగంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుగా తీర్చిదిద్దే మహత్తర చర్యలతో ముందుకు వెళుతోందన్నారు. మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం కోసం ఇప్పటివరకు 269.68 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా, తద్వారా రూ. 9,222 కోట్లకు పైగా మహిళలు ఆదా చేసుకున్నారన్నారు. మహాలక్ష్మి పథకంలో 42.90 లక్షల కుటుంబాలకు సబ్సిడీపై రూ.500లకు ఎల్ పీజీ సిలిండర్ అందిస్తున్నామన్నారు. గృహజ్యోతి కింద పేదల గృహాలకు 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న కార్యక్రమంతో 53.09 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయన్నారు.

**నూతన విద్యా విధానానికి కసరత్తు**

విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం నూతన విద్యా విధానానికి కమిటీని ఏర్పాటు చేసిందని గవర్నర్ వెల్లడించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను 212 శాతం పెంచడంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. యువతలో నైపుణ్యతను పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపించడం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను ఏటీసీలుగా మార్చినట్లు చెప్పారు.

రూ. 11 వేల కోట్లతో వైద్యమౌలిక వసతులు

రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని గవర్నర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 11 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా కొత్త ఆసుపత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం వంటివి ఈ ఏడాది చివరి నాటికి సేవలను అందుబాటులోకి తేవాలన్న కృతనిశ్చయంతో ఉన్నామన్నారు.

పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకెళ్లడానికి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణను ప్రారంభించిందని గవర్నర్ తెలిపారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజావాణిలో ఇప్పటి వరకు 64,697 అర్జీలు అందగా, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 47,670 విజ్ఞప్తులను పరిష్కరించినట్లు వివరించారు.

సామాజిక న్యాయమే లక్ష్యంగా రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించామని చెప్పారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో ముందడుగు వేసి 59 ఎస్సీ కులాలను రిజర్వేషన్ పూర్తి చేశామన్నారు.

మాదక ద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి కల్పించాలన్న దృఢనిశ్చయంతో ఈగల్ ఏర్పాటు చేశామన్న గవర్నర్.. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం పీఎస్సీ పునరుద్ధరణతో పాటు రికార్డు సమయంలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు.

సినిమా రంగంలో ప్రతిభను గుర్తించడానికి గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రారంభించినట్లు గవర్నర్ వివరించారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ సంరక్షణలో భాగంగా దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పుణ్య క్షేత్రాల అభివృద్ధి, వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు.

# సీఎం మారిపోయారు!



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న రాజకీయ శైలిలో వస్తున్న మార్పులను స్వయంగా విశ్లేషించుకుంటున్నారు. ఆవేశం తగ్గించుకుని ఆలోచనతో రాజకీయాలు చేస్తానని అంటున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రేవంత్ రెడ్డి అంటేనే గళం, బలం. ప్రతిపక్ష నేతగా ఆయన చేసిన ప్రసంగాలు ఎంత ఆవేశంగా ఉండేవో అందరికీ తెలిసిందే. సీఎం అయిన తర్వాత కూడా కేసీఆర్, కేటీఆర్ మాటలకు అంతే ఘాటుగా బదులిస్తూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఆయన మాటల్లో మార్పు కనిపిస్తోంది. రాజకీయ ఉపన్యాసాల్లో ఆవేశంగా ఉండే నా పనితీరు, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక మారింది" అని ఆయన చేసిన వ్యాఖ్యలు మార్పును సూచిస్తున్నాయి. పీసీసీ బాధ్యత వేరు, రాష్ట్రాన్ని పాలించే బాధ్యత వేరని.. పదవి ఇచ్చే హుందాతనం తన శైలిని మార్చుకునేలా చేసిందని పరోక్షంగా అంగీకరించారు.

**హుందా రాజకీయాలకే ప్రాధాన్యం**

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై జరిగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా రేవంత్ రెడ్డి తనలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా నా పనితీరులో మార్పులు చేసుకున్నాను అని చెప్పడం ద్వారా, వ్యక్తిగత రాజకీయాల కంటే అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన కేవలం ఒక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, హైదరాబాద్ భవిష్యత్తుకు ఒక గ్రోత్ ఇంజిన్ అని భావిస్తున్న రేవంత్, తనలో ఏదో చేసి చూపించాలన్న తపనను బహిరంగంగానే చాటుకున్నారు. ప్రతిపక్షాలు ఈ ప్రాజెక్టును లూటిఫికేషన్ అని విమర్శిస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఆవేశపడకుండా అంతే హుందాగా సమాధానమిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరైనా నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను అని ప్రకటించడం ఆయన నాయకత్వ లక్షణాల్లోని మార్పును సూచిస్తోంది.

**మాటతీరుపై ఆత్మవిమర్శ**

గతంలో కేసీఆర్, కేటీఆర్ వంటి రాజకీయ ప్రత్యర్థులపై ఆయన వాడిన ఘాటు భాష పలుమార్లు వివాదాస్పదమైంది. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి అంతటి కఠిన పదజాలం వాడటం సమంజసం కాదన్న విమర్శలు మేధావుల నుంచి, రాజకీయ వర్గాల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ కారణంగా ఆవేశం కంటే బాధ్యత ముఖ్యం అని గుర్తించిన రేవంత్, తన భాషకు స్వస్తి పలికి అభివృద్ధి మంత్రం పఠించాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో ప్రతిచర్య అనేది సహజం. రేవంత్ రెడ్డి గతంలో ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడినప్పుడు, బీఆర్ఎస్ నేతలు కూడా అంతకు మించి అన్నట్లుగా ప్రతిదాడి చేసేవారు. ఈ పరస్పర దూషణల వల్ల అసలు ప్రజా సమస్యలు పక్కకు వెళ్లి, వ్యక్తిగత విమర్శలే హైలైట్ అయ్యేవి. ఇప్పుడు రేవంత్ తన భాషను మార్చుకోవడం ద్వారా, బీఆర్ఎస్ నేతలకు ఆ అవకాశం ఇవ్వకూడదని భావిస్తున్నారు. తను మౌనంగా ఉండి పని చేసి చూపిస్తే, ప్రతిపక్షాలు చేసే విమర్శలు అర్థరహితంగా మారుతాయని ఆయన వ్యూహంగా ఉంది.

**నిర్మాణాత్మక రాజకీయాలకు ప్లాన్**

మూసీ పునరుజ్జీవనం వంటి భారీ ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఆసక్తికరంగా ఉంది. కేవలం పట్టుదలకు పోకుండా, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరైనా నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తే తీసుకుంటాను అని ప్రకటించడం ద్వారా అందరినీ కలుపుకుని పోయే దిశగా అడుగులు వేస్తున్నారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన హుందాతనాన్ని కాపాడుతూనే, వివాదాలకు దూరంగా ఉండి ఫలితాలు సాధించాలన్న తపన ఆయనలో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి పదవి అనేది వ్యక్తిగత హోదా కాదు, అది ఒక బాధ్యత అని రేవంత్ భావిస్తున్నారు. మూసీ ప్రక్షాళన వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే కేవలం రాజకీయాలు సరిపోవని, అందరి మద్దతు అవసరమని ఆయన గుర్తించారు. తాజాగా రేవంత్ రెడ్డిలో కనిపిస్తున్న ఈ సానుకూల మార్పు తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని చల్లబరిచే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి తన భాషను నియంత్రించుకోవడం వల్ల, రాష్ట్రంలో ఆరోగ్యకరమైన రాజకీయ చర్చలకు దారితీస్తుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఇదే శైలిని కొనసాగిస్తే, ప్రత్యర్థులు కూడా విమర్శల స్థాయిని తగ్గించక తప్పదు. ఇది అంతిమంగా రాష్ట్ర ప్రయోజనాలకే మేలు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# భారత్‌కు గుడ్ న్యూస్.. ఇక గ్యాస్ కష్టాలు తీరినట్లే!

**ముద్ర, డెస్క్:**
భారతీయుల గ్యాస్ కష్టాలు తీరబోతున్నాయి. ప్రపంచ ఇంధన వాహక మార్గాల్లో కీలకమైన హార్ముజ్ జలసంధి ఘర్షణల మధ్య, భారత నౌకాదల శివాలిక్ విజయవంతంగా అడ్డంకులను అధిగమించింది. మరికొన్ని గంటల్లో గుజరాత్ ముంద్రా పోర్టుకు చేరుకోనుంది. ఈ నౌకలో 40–46 వేల మెట్రిక్ టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) లోడ్ ఉంది. ఈ సరఫరా దేశవ్యాప్త గృహ ఇంధన కొరతలను తగ్గిస్తుంది. చిరు పొట్టి వ్యాపారాలకు గ్యాస్ సరఫరా పెంచుతుంది.

**ఇప్పటికే చేరుకున్న 'నందా దేవి'..**

ఇదిలా ఉంటే మరో నౌక నందాదేవి 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో భారతకు చేరుకుంది. భారత నావికాదలం పూర్తి ఎస్కార్ట్ అందించింది. జలాంతర్గల ప్రమాదాలను నివారిస్తోంది. ఈ రెండు లోడ్‌లు కలిపి 90 వేల టన్నులు ఎల్‌పీజీ తీసుకువస్తున్నాయి. తక్షణ కొరతలను పూర్తిగా తీర్చే అవకాశం ఉంది. ఇది భారత్ జల మార్గాల్లో సాంకేతిక, భద్రతా సామర్థ్యానికి నిదర్శనం.


**హార్ముజ్ జలసంధి ప్రాముఖ్యత**

పపంచంలో 20% క్రూడ్ ఆయిల్, 25% ఎల్‌పీజీ ఎగుమతులు హార్ముజ్ జలసంధి గుండా రవాణా అవుతుంది. ఇటీవల మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ఈ మార్గాన్ని అడ్డుకుని, భారతదేశంలోఎల్‌పీజీ సరఫరా 15–20% తగ్గింది. ఫలితంగా, దశలవారీగా ధరలు పెరిగి, గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్లు అందుబాటులో లేకపోయాయి. భారత్ ఏటా 27 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగిస్తోంది. దీనిలో 50% దిగుతుల పైనే ఆధాపడింది.

**ఆర్థిక, సామాజిక ప్రభావాలు..**

ఎల్‌పీజీ రాక బహుముఖ ప్రయోజనాలు కలిగిస్తుంది. 30 కోట్ల మంది గృహాల్లో ప్రధాన మంత్రి ఉజ్జ్వలా యోజన కవరేజ్‌తో కూడిన కుటుంబాలు ప్రయోజనం పొందుతారు. ధరలు 5 నుంచి 8 శాతం తగ్గే అవకాశం ఉంది. ఫర్టిలైజర్, పెట్రోకెమికల్స్ ఉత్పత్తుల్లో ఖర్చు తగ్గి, వ్యవసాయ ఎరువులు, ప్లాస్టిక్ ధరలు స్థిరంగా ఉంటాయి. ద్రవ్యోల్బణం 1 శాతం తగ్గే అవకాశం ఉంది.

తాత్కాలిక పరిష్కారాలతోపాటు, భారత్ దీర్ఘకాల వ్యూహాలు రూపొందిస్తోంది. మెగాలోగా–ముంద్రా వంటి ప్రాజెక్టులు 2027 నాటికి 10 మిలియన్ టన్నులు సామర్థ్యం పెంచుతాయి. దాద్రా, జైపూర్‌లో కొత్త యూనిట్లు రష్యా, అమెరికా నుంచి డైవర్సిఫైడ్ సోర్సెస్. బయోగ్యాస్ ప్లాంట్లు 5 మిలియన్ టన్నులు జోడిస్తాయి. ఈ చర్యలు హార్ముజ్‌పై ఆధారాన్ని 30 శాతం తగ్గిస్తుంది. జాతీయ శక్తి భద్రతను బలోపేతం చేస్తాయి.



# రేవంత్‌ను కలిసిన తిలక్ వర్మ

**ముద్ర న్యూస్ :**
టీమ్ ఇండియా క్రికెటర్ తిలక్ వర్మ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.టీ20 ప్రపంచకప్–2026 గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా తిలక్ వర్మను కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తిలక్ వర్మను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు వి. నరేంద్ర రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఎండీ డా. సోనీ బాలాదేవి పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వడ్డీ రేట్లు**
**హెచ్‌డీఎఫ్‌సీ**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1–2 సంవత్సరాల FDలకు సుమారు 6.25%–6.45% వరకు వడ్డీ.సీనియర్ సిటిజన్లకు 6.75%–6.95% వరకు వడ్డీ ఉంటుంది.






# నార్సింగిలో దారుణం

- చాక్లెట్ ఆశచూపి ఆరేళ్ల బాలికపై హత్యాచారం, హత్య చేసిన నిందితుడు
- సీసీ కెమెరాలో గుర్తింపు
- అరెస్ట్ చేసిన పోలీసులు

**ముద్ర డెస్క్ :**
హైదరాబాద్ నార్సింగిలో జరిగిన అత్యంత దారుణ ఘటన కలకలం రేపింది. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి, బాలికను గుర్తుతెలియని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు నిందితుడు. నిన్న సాయంత్రం నుంచి బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించగా, బాలికను తీసుకెళ్తున్న దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. వాటి ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. బాలికను కిడ్నాప్ చేయడం, అత్యాచారం చేసి హత్య చేయడం వెనుక గల కారణాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. నార్సింగి పోలీసులు ఈ కేసును రేప్ అండ్ మర్డర్ కేసుగా నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కోరనున్నారు.

## కామారెడ్డి పురపాలికలో ఏసీబీ సోదాలు

**ముద్ర డెస్క్ :**
కామారెడ్డి పురపాలికలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆరా తీస్తున్నారు. కమిషనర్ ఛాంబర్‌లో అధికారులు విచారణ చేపట్టారు. తనిఖీలతో ఆయా శాఖల అధికారుల్లో గుబులు మొదలైంది.






## అర్హులకే ఇళ్లు.. అక్రమార్కులకు చెక్

- క్యూర్ పరిధిలో మొదటి విడత
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసంలో లేని వారికి నోటీసులు
- ఏప్రిల్ 30వరకు గడువు
- మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్ష

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలోగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు.. ఎంతమంది స్పందించారు.. అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదకన గాకుండా వేలం పద్ధతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కటక్ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం

- 10 మంది దుర్మరణం ఐసీయూలోనే
- బూడిదగా మారిన వైనం






**ముద్ర డెస్క్ :**
ఒడిశాలో ఘోర ప్రమాదం జరిగింది. ఎస్.సి.బి మెడికల్ కాలేజీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని ట్రామాకేర్ ఐసీయూ విభాగంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు ప్రాణాలు కోల్పోగా.. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున ఆసుపత్రిలోని ట్రామాకేర్ బ్లాక్‌లో ఉన్న ఐసీయూలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. క్షణాల్లోనే మంటలు ఐసీయూ అంతటా వ్యాపించడంతో పాటు దట్టమైన పొగ కమ్మేసింది. ఆ సమయంలో ఐసీయూలో వెంటిలేటర్లపై ఉన్న రోగులు బయటకు రాలేక, ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు.

**రెస్క్యూ ఆపరేషన్‌లో విషాదం**
సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. సుమారు 15 మంది రోగులను సురక్షితంగా బయటకు తరలించారు. అయితే రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న కొందరు సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది కూడా దట్టమైన పొగ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం గాయపడిన వారందరికీ అదే ఆసుపత్రిలోని మరో విభాగంలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

**సీఎం పరామర్శ.. ఉన్నత స్థాయి విచారణ**
ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన సీఎం, ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. అగ్నిమాపక నిబంధనల అమలులో ఏవైనా లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

**భయాందోళనలో రోగుల బంధువులు**
రాష్ట్రంలోనే అతిపెద్ద ఆసుపత్రిలో ఇలాంటి ప్రమాదం జరగడంతో రోగుల బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. బాధితులకు అవసరమైన సాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.

# కరీంనగర్ కు ఊపిరి ఆడడంలేదు!

- మళ్లీ కాలుష్య కోరలు
- మంటలు అంటుకున్న డంప్‌యార్డ్
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులు
- చిన్నారులు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు
- తక్షణ చర్యలు తీసుకోవాలని ఆవేదన



**ముద్ర, కరీంనగర్ :**
కరీంనగరంలోని డంప్‌యార్డ్ మళ్ళీ నిప్పులు చిమ్ముతోంది. ఆదివారం ఒక్కసారిగా డంప్‌యార్డ్‌లో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ కమ్మేసింది. ఈ ప్రభావంతో ఆటోనగర్, కోతిరాంపూర్, అల్కాపురి కాలనీ, గణేష్ నగర్, పోచమ్మవాడ, లక్ష్మీనగర్, కమాన్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**తీరని కాలుష్య కష్టాలు**
గత కొంతకాలంగా కరీంనగర్ డంప్‌యార్డ్‌లో తరచుగా మంటలు చెలరేగుతుండటంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది. విషపూరితమైన పొగ వల్ల చిన్నారులు, వృద్ధులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**
ఇటీవలే రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డంప్‌యార్డ్‌ను సందర్శించి, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కొన్ని ఏజెన్సీల ద్వారా బయో మైనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, శాశ్వత పరిష్కారం వచ్చే వరకు పనులు పూర్తికావడానికి సమయం పట్టే అవకాశం ఉంది.



**ప్రజల ఆవేదన**
బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పడుతున్న నేపథ్యంలో, కనీసం తక్షణ చర్యలు చేపట్టాలని బాధిత కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిరోజూ మంటలు, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తాము, కనీసం తాత్కాలిక పరిష్కారమైనా చూపాలని కోరుతున్నారు. కాలుష్యం నుండి తమను కాపాడాలని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

## విశారదన్ అరెస్టు

**ముద్ర, ఖమ్మం :**



వెలుగుమట్ల భూ దాన్ బాధితుల న్యాయం చేయాలని, ఇల్లు కోల్పోయిన ప్రతీ బాధితునికి ఇల్లు ఇవ్వాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ను కలిసేందుకు ఖమ్మం వచ్చిన డీఎస్పీ (దళిత శక్తి ప్రోగ్రామ్) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వెలుగుమట్లలో కేవలం 311 మందికే ఇల్లు ఇస్తామని ప్రకటించడం బాధాకరమని, అర్హులందరికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ ప్రాంతానికి రాగానే పోలీసులు అరెస్టు చేసి, కొణిజర్ల పోలీస్ స్టేషన్ కు అక్కడి నుంచి వైరాకు తిరిగి మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నుండి మధిర రూరల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. 62 ఎకరాల భూ దాన్ భూమిని న్యాయబద్ధంగా సాధింస్తామని, కూల్చిన 725 ఇళ్ల స్థానంలోనే అందరకి ఇల్లు కట్టించేవరకు పోరాటం ఆగదని వెల్లడించారు.

# సభలో వందేమాతరం.. వాకౌట్ చేసిన ఎంఐఎం

- గవర్నర్ ప్రసంగానికి ముందే ఘటన
- బీజేపీ నేతల తీవ్ర అభ్యంతరం
- జాతీయ గేయానికి గౌరవం ఇవ్వలేదని విమర్శలు
- మళ్లీ వేడెక్కిన ఎంఐఎం – బీజేపీ రాజకీయాలు
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి




**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్ రాజకీయాల్లో ఎప్పుడూ ఏదో ఒక అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతూనే ఉంటుంది. అయితే తాజాగా అసెంబ్లీ వేదికగా జరిగిన ఒక ఘటన తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ముందు జరిగిన 'వందేమాతరం' గీతాలాపన సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుండి బయటకు వెళ్లడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ అంశంపై బీజేపీ, ఎంఐఎంల మధ్య మరోసారి మాటల తూటాలు పేలుతున్నాయి.

**వివాదం ఏమిటి?**
గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడానికి సిద్ధమైన సమయంలో సంప్రదాయం ప్రకారం 'వందేమాతరం' గీతాన్ని ప్రసారం చేశారు. సభలోని సభ్యులంతా నిలబడి గేయాన్ని ఆలపిస్తుండగా, ఎంఐఎంకు చెందిన ఎమ్మెల్యేలు సభ నుండి బయటకు వెళ్లిపోయారు. జాతీయ గీతాలు, జాతీయ చిహ్నాలు దేశానికి ప్రతీకలని, వాటిని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజాప్రతినిధులై ఉండి ఇటువంటి చర్యలకు పాల్పడటం సరికాదని బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**బీజేపీ ఆరోపణలు.. దేశభక్తి కోణం**
ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను, జాతీయ భావాలను అవమానించడమేనని వారు మండిపడుతున్నారు. బీజేపీ నేతల ప్రకారం.. ఇది కేవలం ఒక రోజు జరిగిన ఘటన కాదు. ఎంఐఎం పార్టీకి దేశం పట్ల, జాతీయ చిహ్నాల పట్ల గౌరవం లేదని, వారు హైదరాబాద్ నగరాన్ని, ముఖ్యంగా పాతబస్తీని తమ ఇష్టారాజ్యంగా మార్చుకున్నారని బీజేపీ నిరంతరం విమర్శిస్తూనే ఉంది. గతంలో జరిగిన పలు సంఘటనలను ఉదాహరణగా చూపిస్తూ ఎంఐఎం నేతల రాజకీయ శైలి దేశ ఐక్యతకు విఘాతమని వారు ఆరోపిస్తున్నారు.

**పాతబస్తీ, వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యం**
ఎంఐఎం పార్టీపై బీజేపీ చేస్తున్న విమర్శల్లో ప్రధానంగా 'దేశభక్తి' అంశం ఉంటుంది. గతంలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అప్పట్లో దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేపాయి. ఆ ఘటనతో ఎంఐఎం నేతల రాజకీయ ప్రసంగాలు, భావజాలంపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఆనాటి నుంచి నేటి వరకు ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరి సరైనది కాదని, రాజ్యాంగ పదవుల్లో ఉండి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, ఇలాంటి పద్ధతుల్లో వ్యవహరించడం ప్రజలను అవమానించడమేనని బీజేపీ వాదిస్తోంది.

**రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు**
ఈ సంఘటనపై రాజకీయ వర్గాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బీజేపీ ఈ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎంఐఎంను దేశ వ్యతిరేక పార్టీగా ముద్ర వేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు ఎంఐఎం పార్టీ నుంచి ఇప్పటివరకు ఈ ఘటనపై అధికారికంగా పూర్తిస్థాయి వివరణ రాలేదు. అయితే, ఈ అంశం రాజకీయంగా బీజేపీకి మేలు చేస్తుందా, లేక ఎంఐఎం తన వాదనతో ఎలా సమాధానం చెబుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ఏది ఏమైనప్పటికీ అసెంబ్లీలో జరిగిన ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడిని పెంచింది. జాతీయత, దేశభక్తి వంటి సున్నితమైన అంశాలు వేదికైనప్పుడు రాజకీయ పార్టీలు ఎంతటి బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే ప్రశ్న ఇప్పుడు ప్రజల ముందు నిలుస్తోంది. రాబోయే రోజుల్లో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
17.03.2026 మంగళవారం, హైదరాబాద్




నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# పరీక్షల ఒత్తిడి వద్దు, ప్రతిభ ప్రదర్శనే ముద్దు !



మార్చి, ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన మానసిక ఒత్తిడి, తెలియని భయం పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే "ఆశావహ మానసిక ఒత్తిడి" లేదా "పాజిటివ్ మెంటల్ స్ట్రెస్" ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసు కోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుంది. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యాలు పెట్టుకున్న యువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న మెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపై ప్రతికూల ప్రభావాలు పడడంతో పాటు గతం కన్న తక్కువ స్థాయిలో ఫలితాలు సాధిస్తాయి.

**పరీక్షల ఆందోళనల లక్షణాలు:**

పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, మానసిక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురి కావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడి పెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా సులభంగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణ సంబంధ సమస్యలు, గుండె వేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయ దాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలు కనిపిస్తాయి. భావోద్వేగ ఆందోళన వల్ల అభద్రతా భావం, తన శక్తి మీద నమ్మకం తగ్గడం, నిస్సహాయ స్థితి, ఏదో తెలియని లోపం వెంటాడడం, ప్రతికూల స్వయం భావనలు, అనవసర ఆలోచనలు వెంటాడడం, నిరాశ నిస్పృహలు మేల్కొనడం లాంటి మానసిక ప్రతికూల లక్షణాలు బయట పడతాయి. వీటికి తోడుగా ఏకాగ్రతకు భంగం కలగడం, చంచలత్వం, వాయిదా వేసే ప్రవృత్తి పెరగడం, ఇతర సహచరులతో అనవసరంగా పోల్చుకోవడం, నిద్ర లేమి సమస్యలు ఉత్పన్నం కావడం సాధారణంగా కనిపిస్తుంది.

**పరీక్షల ఒత్తిడిని జయించడం ఎలా ?**

రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాల పట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతాక్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంత వరకు గుర్తు ఉన్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంటకు ఒకసారి 5 నిమిషాల స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘ శ్వాసలు తీసుకోవడం, దూరంగా ఉన్న ప్రకృతి సౌందర్యాలను చూడడం వల్ల ఏకాగ్రత మెరుగు పడుతుంది. గత పరీక్షలో పొందిన మార్కుల కన్న ఎక్కువ రావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటి కన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మన మీద మనకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ఉండాలి. మనం చదివే చదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తి పలకాలి. నా శక్తివంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధించగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మస్థైర్యాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్య మధ్య పాలు లేదా టీ లేదా పండ్ల రసాలు లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. మధ్య మధ్య ధ్యానం, దీర్ఘ శ్వాసలు తీసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. చదువుతున్న పాఠంలోని ముఖ్య అంశాలను అండర్‌లైన్ చేసుకోవడం అనే అలవాటు మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, డయాగ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటి అంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడం మంచిది. ఒక సారి రాస్తే పది సార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. కఠినమైన అంశాలు అంటూ పక్కన పెట్టడం మంచిది కాదు. ప్రతి రోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. అవసరమని భావించినపుడు మీకు ఇష్టమైన టీచర్ లేదా సలహాదారుతో మాట్లాడండి. చక్కెరలు అధికంగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండండి.

**పరీక్ష రోజు, తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు:**

పరీక్ష రోజున కనీసం 15 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. ప్రోటీన్లు అధికంగా ఉన్న నట్స్, గింజలు, చేపలు లాంటి ఆహార పదార్థాలను పరిమితంగా తీసుకొండి. అవసరమనించినపుడు కొద్ది పాటి నీరు తాగండి. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్ర పోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగం కలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్క నిమిషం ఆసలస్యం అయినా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. పరీక్ష హాల్‌లో ఒత్తిడి పెరిగినట్లు అనిపిస్తే ఒకటి రెండు నిమిషాలు కళ్లు మూసుకొని, నిశ్శబ్దం పాటించి, దీర్ఘ శ్వాస తీసుకొని వదలడం చేసిన తర్వాత మళ్లీ రాయడం మొదలు పెట్టండి. పరీక్షలో సమాధానాలు రాస్తున్నపుడు సమయపాలన పాటించండి. చివరి నిమిషాల్లో ఆందోళనలు పెరిగే పనులు చేయవద్దు. పరీక్షల్లో రాసేటప్పుడు ఇతర సహచరుల వైపు చూడవద్దు. మార్కులను బట్టి ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో నిర్ణయించుకొండి. కనీసం 10 15 నిమిషాల ముందు రాయడం పూర్తి చేసి, ఏం రాసామో, ఎలా రాసామో పేపర్‌ను తిరగేసి పరిశీలించండి. ఒకటి రెండు చిన్న ప్రశ్నలకు సమాధానాలు సరిగ్గా రాయకపోయినా దాని గురించి అనవసర ఆందోళన చెందితే రాబోయే పరీక్షలపై దాని ప్రతికూల ప్రభావం పడుతుందని మరువరాదు. నీపై నీకు నియంత్రణ ఉండే విధంగా చూసుకోవాలి. పరీక్ష పూర్తి అయిన తర్వాత ఎలా రాసామో అనే అంచనా చేయవచ్చు, కాని అతిగా దాని గూర్చి ఆలోచించవద్దు.

**తల్లితండ్రుల పాత్ర:**

పరీక్షల పట్ల ఆశావహ ఆలోచనలు మెరుగైన ఫలితాలను అందిస్తాయని, నేను మంచిగా రాయగలను, ఉత్తమ ఫలితాలను సాధించగలనూ అనే ఆలోచనలు మన ప్రతిభకు ఊతం ఇస్తాయి. శక్తివంచన మేరకు కృషి చేయడం, పరీక్షలను చక్కగా రాయడం ఉత్తమం. పరీక్ష ఫలితాల పట్ల ముందే అతిగా ఆశలు పెట్టుకోవడం మానండి. ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మన మీద మనకు నమ్మకం కలిగి ఉండాలి. తల్లితండ్రులు పిల్లలను అనవసర ఆందోళనలకు గురి చేయవద్దు. శక్తికి మించిన భారాన్ని మోపవద్దు. సమతుల ఆహారం ఇవ్వండి. ఇతర పిల్లలతో పోల్చడం మానేయండి. ప్రేరణాత్మక వాతావరణం కల్పించండి. మార్కులు అతిగా రావాలని ఇబ్బంది పెట్టకండి. ఉత్తమ పుస్తకాలు, చదివే వాతావరణం, కుటుంబ ప్రశాంతత, ఏకాగ్రత పెంచే సౌకర్యాల కల్పన చేయడం మరువరాదు. మన పిల్లల శక్తిసామర్థ్యాలను తెలుసుకొని వారికి మార్గనిర్దేశనం చేయండి. పరీక్షలు అంటే బ్రహ్మ విద్య కాదని, రెండు మార్కులు తక్కువగా వస్తే జీవితం అంతం కాదని, నీ జ్ఞాపక శక్తికి ఒక పరీక్ష అని, దానితోనే జీవితం ముడిపడి ఉందనే భావనలను చెరిపేస్తూ, జీవితాంతం ఒకదాని తర్వాత మరొక పరీక్ష ఉంటుందని తెలుసుకోవాలి. పరీక్షలే జీవితం కాదని, జీవితంలో పరీక్షలు ఒక చిన్న భాగమని పిల్లలకు ధైర్యం నూరి పోద్దాం, వారి ఎదుగుదలకు మన అవసర చేయూతను అందిద్దాం.



డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి
సామాజిక విశ్లేషకులు
9949700037

## ప్రపంచ గతిని నిర్దేశించిన భారతీయ సైన్స్



- *శాస్త్ర, సాంకేతిక రంగాలలో ముందంజలో ఉండడానికి అధిక నిధులు కేటాయించాలి

భారతదేశానికి గొప్ప వైజ్ఞానిక చరిత్ర ఉంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతుందని చెప్పిన ఆర్యభట్ట, సున్నా మరియు దశాంశ విధానాన్ని ప్రపంచానికి అందించిన గణిత శాస్త్రవేత్తలు, మత్తు మందు లేకుండా కంటి శస్త్రచికిత్స చేసిన Wసుశ్రుతుడు, మూలికా వైద్యాన్ని అభివృద్ధి చేసిన చరకుడు వంటి మహానుభావులు ఈ నేలపై పుట్టారు. గురుత్వాకర్షణ శక్తి గురించి కూడా భాస్కరాచార్యుడు ప్రస్తావించాడు. హరప్పా, మొహెంజోదారో నాగరికతల్లోనే నగర నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, నీటి సరఫరా వంటి శాస్త్రీయ విధానాలు అమలులో ఉండేవి. అశోకుడి స్తూపాలు నాటి నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనాలు. చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి వైద్య గ్రంథాలు భారత వైద్య విజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయి. నలంద, తక్షశిల, విక్రమశిల వంటి విశ్వవిద్యాలయాలు ప్రపంచ విద్యా కేంద్రాలుగా నిలిచాయి.

అజంతా చిత్రాలు, మెహరోలీ ఇనుప స్తంభం వంటి నిర్మాణాలు భారత శాస్త్రీయ నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. దక్షిణ భారత నౌకా నిర్మాణం, విదేశీ వాణిజ్యం కూడా పురాతన కాలంలోనే అభివృద్ధి చెందాయి.

అయితే ఆరవ శతాబ్దం తరువాత మత ఛాందసత్వం, విదేశీ దండయాత్రలు, బ్రిటిష్ పాలన కారణంగా భారత విజ్ఞాన రంగం క్షీణించింది. స్వాతంత్ర్యం తరువాత కూడా శాస్త్ర సాంకేతిక రంగాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోయారు. విద్యా వ్యవస్థ ఎక్కువగా ఉద్యోగుల తయారీకి పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం భారతదేశంలో సహజ వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ సాంకేతిక అభివృద్ధి కోసం మరింత పెట్టుబడి అవసరం. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం, విద్యా విధానంలో మార్పులు చేయడం అత్యవసరం.నూతన విద్యా విధానంలో ఆరో తరగతి నుంచే నైపుణ్య విద్య, వృత్తి విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేసి శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించాలి.దేశ సమగ్రాభివృద్ధి కోసం శాస్త్ర సాంకేతిక రంగాలకు తగిన నిధులు కేటాయించి, పాఠశాల స్థాయి నుంచే బాల శాస్త్రవేత్తలను తయారు చేయాలి. భారతదేశం మళ్లీ ప్రపంచానికి విజ్ఞాన కాంతులు పంచాలంటే శాస్త్ర సాంకేతిక అభివృద్ధే మార్గం.

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా 9848445134
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు




# నర్మేట్ట తోడుగా.. పామాయిల్‌తో రైతు పండుగ!

**(18 నెలల రికార్డు కాలంలో నిర్మాణం.. ప్రభుత్వ దూరదృష్టిపై ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం)**

తెలంగాణ వ్యవసాయ రంగం ఒక చారిత్రాత్మక మలుపు వద్ద నిలబడింది. కేవలం వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతుల ఆదాయాన్ని సుస్థిరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట్టలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఇప్పుడు తెలంగాణ ఆయిల్ పామ్ విప్లవానికి చిహ్నంగా నిలుస్తోంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో కేవలం 18 నెలల రికార్డు సమయంలోనే ఈ ఫ్యాక్టరీ పనులు పూర్తి కావడం ఒక అద్భుతమైన పరిణామం. గంటకు 30 నుండి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగిన ఈ ఫ్యాక్టరీ, కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు.. వేలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపే ఒక ఆశాదీపం.

**రికార్డు సమయం - రికార్డు సాంకేతికత**

సాధారణంగా ప్రభుత్వ రంగంలో భారీ ప్రాజెక్టులు పూర్తి కావడానికి ఏళ్లు పడుతుంటుంది. కానీ, నర్మేట్ట ఫ్యాక్టరీని కేవలం 18 నెలల్లోనే ట్రయల్ రన్ దశకు తీసుకురావడం వెనుక ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తోంది. మలేషియా నుండి తెప్పించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ 'జీరో వేస్ట్' విధానాన్ని అమలు చేస్తున్నారు. గెలల నుండి నూనె తీసిన తర్వాత మిగిలే వ్యర్థాల నుండి 4 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే బయో పవర్ ప్లాంట్ ఇక్కడ ఉంది. అంటే, పరిశ్రమకు కావాల్సిన విద్యుత్‌ను అది స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. అంతేకాకుండా, పర్యావరణ పరిరక్షణ కోసం 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానంలో నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఇది దేశంలోనే అత్యాధునిక ఆయిల్ పామ్ యూనిట్లలో ఒకటిగా నిలవబోతోంది.

**వరి నుండి వాణిజ్యం వైపు - పంట మార్పిడి ఆవశ్యకత**

తెలంగాణలో వరి సాగు రికార్డు స్థాయికి చేరుకుంది. ప్రభుత్వం ఇస్తున్న బోనస్, సాగునీటి సౌకర్యాల వల్ల దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్న రాష్ట్రంగా మనం ఉన్నాం. అయితే, కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై విధిస్తున్న పరిమితులు, మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో రైతులకు ఒక ప్రత్యామ్నాయం అవసరం. అదే ఆయిల్ పామ్. ఒకసారి నాటితే 25 నుండి 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం ఇచ్చే ఈ పంట, రైతులకు ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ లాంటిది. వరికి ఏటా కష్టపడాలి, కానీ ఆయిల్ పామ్ నాలుగో ఏడు నుండి దిగుబడి ప్రారంభించి, మూడు దశాబ్దాల పాటు రైతు ఇల్లు గడిపేలా చూస్తుంది. మంత్రి తుమ్మల చెప్పినట్లుగా, ఈ పంటకు కోతుల బెడద, అడవి పందుల సమస్య లేకపోవడం రైతులకు ఒక పెద్ద ఊరట.

**ఆర్థిక భరోసా - మూడో రోజుకే ఖాతాలో సొమ్ము!**

సాధారణ పంటలకు మార్కెట్ యార్డుల చుట్టూ తిరగడం, సొమ్ముల కోసం నెలల తరబడి వేచి చూడటం రైతులకు పరిపాటి. కానీ, ఆయిల్ పామ్ విషయంలో ఆయిల్ ఫెడ్ సరికొత్త పారదర్శకతను ప్రవేశపెట్టింది. గెలలను ఫ్యాక్టరీకి విక్రయించిన కేవలం మూడో రోజే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ధరల విషయంలోనూ ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. మంత్రి తుమ్మల బాధ్యతలు చేపట్టినప్పుడు టన్నుకు రూ.12,000 ఉన్న ధరను, కేంద్రంతో చర్చించి దిగుమతి సుంకాలు పెంచేలా చేసి, నేడు రూ.21,546కు తీసుకువచ్చారు. దీనిని రూ.25,000 కు పెంచాలని ప్రధానిని కోరడం ద్వారా రైతులకు గరిష్ట లాభం చేకూర్చాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం స్పష్టమవుతోంది.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

ఆయిల్ పామ్ తోటల్లో కేవలం నూనె గెలలే కాదు, ఇతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చని ప్రభుత్వం సూచిస్తోంది. కోకో, జాజికాయ, మెకడామియా వంటి విలువైన ఉద్యాన పంటలను అంతర పంటలుగా వేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రూ.50,921 వరకు సబ్సిడీని అందిస్తోంది. మొక్కలను ఉచితంగా ఇవ్వ డ మే కాకుండా, డ్రిప్ పరికరాలను కూడా అం



దజేస్తోంది. అంటే, రైతుపై పెట్టుబడి భారం తగ్గించి, లాభాల బాటులో నడిపించేందుకు అన్ని మార్గాలను సుగమం చేస్తోంది.

**దిగుమతులు తగ్గించి.. స్వయం సమృద్ధి దిశగా**

భారతదేశం వంట నూనెల కోసం ఇతర దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఏటా సుమారు 164 లక్షల టన్నుల వంట నూనెలను మనం దిగుమతి చేసుకుంటున్నాము. ఇందులో 59 శాతం వాటా పామాయిల్‌దే. గత ఏడాది మాత్రమే లక్షా 38 వేల కోట్ల రూపాయలను వంట నూనెల కోసం విదేశాలకు చెల్లించాము. అంటే, మన దేశంలోని సంపద విదేశాలకు వెళ్తోంది. తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకుంటే, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవ్వడమే కాకుండా, మన రైతుల జేబులు నిండుతాయి. ప్రస్తుతం తెలంగాణలో 2.91 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, దీనిని యుద్ధ ప్రాతిపదికన విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**నర్మేట్టతో మొదలైన సరికొత్త ప్రయాణం**

నర్మేట్ట ఫ్యాక్టరీ కేవలం సిద్దిపేట జిల్లాకే కాకుండా జనగామ, యాదాద్రి భువనగిరి, గద్వాల్, నారాయణపేట వంటి పొరుగు జిల్లాల రైతులకు కూడా వరప్రదాయిని కానుంది. ఈ ఫ్యాక్టరీతో పాటు త్వరలో ఇక్కడ ఆయిల్ రిఫైనరీ యూనిట్‌కు కూడా సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అంటే, పచ్చి గెలల నుండి నూనె తీయడమే కాకుండా, దానిని శుద్ధి చేసి నేరుగా మార్కెట్లోకి పంపే స్థాయికి మనం చేరుకుంటున్నాము. ఇది స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరుస్తుంది. రైతుల సందర్శన కోసం ఏర్పాటు చేయనున్న మూడు రోజుల అవగాహన సదస్సులు, శాస్త్రవేత్తలతో చర్చలు రైతుల్లో ఉన్న అనుమానాలను పటాపంచలు చేస్తాయి.తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయిల్ పామ్ సాగుపై ఉన్న అనుభవం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న అభివృద్ధి కాంక్ష తోడవ్వడంతో రాష్ట్రం ఇప్పుడు 'ఆయిల్ పామ్ హబ్'గా మారుతోంది. నర్మేట్ట ఫ్యాక్టరీ విజయం ఒక ఆరంభం మాత్రమే. ఇది రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల ఎకరాల సాగు లక్ష్యానికి ఊతం ఇస్తుంది. రైతు రాజు కావాలంటే కేవలం సేద్యం చేస్తే సరిపోదు, అది లాభసాటి వాణిజ్య సేద్యం కావాలి. ఆ దిశగా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు అందిపుచ్చుకుంటే, తెలంగాణ గడ్డపై ఆయిల్ పామ్ గెలలు నిజంగానే 'బంగారు గెలలుగా' మారి రైతుల ఇంట సిరిసంపదలు కురిపిస్తాయి. గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి, దేశం వంట నూనెల రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి నర్మేట్ట ఫ్యాక్టరీ ఒక బలమైన పునాది.

- పురుషోత్తం ఎన్.
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17.03.2026
www.mudranews.in | @mudranews



వడ్డీ రేట్లు
ఐసిఐసిఐ బ్యాంక్ FDలపై గరిష్ఠంగా 6.50% వరకు వడ్డీ.సీనియర్ సిటిజన్లకు దాదాపు 7% వరకు లభిస్తుంది.
ICICI Bank

# ప్రజావాణి అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు తమ సమస్యల పరిష్కారంకై దాఖలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుండి రెవెన్యూ శాఖవి 23, ఇతర శాఖలవి 29, మొత్తం 52 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







**ప్రజావాణికి 119 పిర్యాదులు**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రజావాణిలో 119 దరఖాస్తులు స్వీకరణప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు.

**నాగర్ కర్నూల్ లో..**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జివి శ్యామ్ ప్రసాద్ లాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 44 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా వారంలోపు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

## డ్రక్స్ రహిత తాండూర్ అందరి బాధ్యత

**ముద్ర, తాండూర్:**




తాండూర్ పట్టణాన్ని డ్రక్స్ రహిత సమాజంగా మార్చటమే మనందరి బాధ్యత అని తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ అన్నారు సోమవారం తాండూర్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, రాజకీయ ప్రముఖుల ఆధ్వర్యంలో డ్రక్స్ పై అవగాహన కల్పిస్తూ ఇందిరా చౌక్ నుంచి శివాజీ చౌక్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును కుటుంబాల ఆనందాన్ని సమాజ భవిష్యత్తును దెబ్బతీస్తుందని కావున ప్రతి ఒక్కరూ తాండూర్ పట్టణాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా మార్చడానికి పాటుపడాలని ఆమె కోరారు. అదేవిధంగా ఎవరైనా సంఘటిత కార్యకలాపాలకు పాల్పడినట్లు కనిపిస్తే వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, వివిధ పార్టీల మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు, రాజకీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

**ముద్ర, తాండూర్:**



వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని క్లాసిక్ గార్డెన్లో సామూహిక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఫలారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించడం ద్వారా పేదవాడి ఆకలి బాధ ఎలా ఉంటుందో తెలుస్తోందన్నారు. మనకున్న దానిలో కొంతనైనా పేదలకు దానం చేయడం ద్వారా అల్లాహ్ ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

**ముద్ర, కూకట్‌పల్లి:**



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'దవాత్-ఏ-ఇఫ్తార్' విందులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ఇఫ్తార్ లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పేద ముస్లిం కుటుంబాలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో మసీదుల మరమ్మతులకు నిధులు, పేదలకు దుస్తుల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. క కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు

## గ్యాస్ కొరతపై సిపిఐ నిరసన



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**

దేశంలో గ్యాస్ కొరతను నివారించడంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ నాయకులు తీవ్రంగా విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నాగర్ కర్నూల్‌లో సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి ఖాళీ గ్యాస్ సిలిండర్లతో అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం కట్టెల పొయ్యిపై జొన్న రొట్టెలు వండి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ గ్యాస్, డీజిల్, పెట్రోల్ కొరతపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ఆన్లైన్‌లో బుక్ చేసుకున్న ప్రతి పౌరుడికి వెంటనే గ్యాస్ సిలిండర్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు గ్యాస్ సరఫరా చేయకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే గ్యాస్ గోదాములను ముట్టడించేందుకు కూడా వెనుకాడమని సిపిఐ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

జిల్లా కలెక్టరేట్ ఎదుట టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి దశల వారీ పోరాటంలో భాగంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీధర్ శర్మ మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలపై సహేతుకమైన నిర్ణయం తీసుకొని బేసిక్ పే అమలు చేయాలని, లేనిపక్షంలో మార్చి 20న "ఛలో అసెంబ్లీ" కార్యక్రమం నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సి. తిరుపతయ్య, జిల్లా కార్యదర్శి ఆర్. లక్ష్మణ్, కె. రాజాబాయి, రాష్ట్ర కౌన్సిలర్ ఎం. కురుమయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. వెంకటయ్య, డి. శేషగిరి, కోటేశ్వర్, పి. వహీద్ ఖాన్ పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలని బీజేపీ ఆందోళనలు

**ముద్ర కూకట్‌పల్లి :**

రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి ఎం.ఆర్.ఓ కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాంజల పద్మయ్య, కెపిహెచ్‌బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి పాల్గొన్నారు.నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల అధ్యక్షులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు.

**ముద్ర, నారాయణపేట :**

ప్రభుత్వ హామీలను అమలు చేయాలని రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని బీజేపీ నారాయణపేట మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. సర్పంచులు చంద్రశేఖర్ గౌడ్, మణెమ్మ బాలు,



ఉపసర్పంచ్ లు సురేష్, రాధాకృష్ణ, భజరంగ్, మాజీ సర్పంచులు శివప్ప, రామకృష్ణ, నాయకులు నారాయణ రెడ్డి , కార్తీక్ , రాము తదితరులు పాల్గొన్నారు. కాగా పేట మునిసిపల్ కార్యాలయంలో బీజేపీ టౌన్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హామీల అమలుపై వినతిపత్రం అందించారు.

**ముద్ర, గద్వాల:**

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు సోమవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో బీజేపి నాయకులు ర్యాలి నిర్వహించి, అయా తహసీల్దార్ కార్యాలయాలో వినతి పత్రం అందజేశారు. బిజేపీ జిల్లా అధ్యక్షుడు, మండలాధ్యక్షుడు టి.శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గద్వాల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

# ఎరువుల దుకాణాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**


రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివ శంకర్ ఆగ్రో ట్రేడర్స్ ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల స్టాక్ వివరాలను ప్రతి రోజూ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని విక్రయాలు ఈ – పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, లైసెన్స్ లేకుండా ఎరువుల అమ్మకాలు జరగకూడదని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ బస్తీ దవాఖానాను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ నిల్వచేసిన మందులు, వైద్య సామగ్రిని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు తరలించాలని ఆదేశించారు. ఆసుపత్రి లోపల, పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు గోనుపాడు శివారులో కలెక్టర్ పొలాలను సందర్శించి పంటల స్థితిగతులను పరిశీలించారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనపై సంపూర్ణ అవగాహన అవసరం

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**

జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా మొదట ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు గాను గణనపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు ఇండ్ల గణనపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే ట్రైనర్స్ ను అడిగి వెంటనే పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డిఓ శ్రీనివాసరావు, సెన్సెస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ లాజర్, సిపిఓ పాపయ్య, ట్రైనర్ సుల్తాన్, సంబంధిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






**దేశాభివృద్ధికి జనగణన కీలకం**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

జన గణన 2027 పథకాల అమలు, దేశ అభివృద్ధికి మూలమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జన గణన–2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు (ఛార్జీ అధికారులు) 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా, తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు, డైరెక్ట్రేట్ ఆఫ్ ప్లానింగ్ శాఖ జనాభా లెక్కల అధికారులు శ్రీకాంత్ నాయక్, వంగ పండు గీత ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ ఓ మంగీలాల్, తాండూర్ డి ఆర్ ఓ అనిత, ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, అన్ని మండలాల తహసీల్దార్ లు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలి

**ముద్ర, కాప్రా:**



సమాజంలోని నిరుపేద ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. నిరుపేదలు, భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భావాన్ని చాటుతున్న ఈసీఐఎల్ లోని సోలిస్ ఐ కేర్ సీఎండీ, తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ నందనంపాటి రాము నిజమైన సేవా స్ఫూర్తి ప్రదాత అని ఉప్పల్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అభినందించారు. సోమవారం ఈసీఐఎల్‌లోని సోలిస్ ఐ కేర్ హాస్పిటల్‌లో "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు అందుకున్న నందనంపాటి రాము అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నందనంపాటి రాము సమాజంలో సేవా కార్యక్రమాలకు ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇందులో భాగంగా పాండిచ్చేరిలోని తిరునల్లార్ లోని ప్రసిద్ధ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరిగిన శని పేర్చి పవిత్ర ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు లక్షల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదోసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ చేతుల మీదుగా నందనంపాటి రాముకు "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు ప్రదానం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సోలీస్ ఐ కేర్ సిబ్బంది విజయేందర్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

## అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు విశారాధన్ మహారాజ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం నాగర్ కర్నూల్‌లో ధర్మ సమాజ్ పార్టీ, బీసీ జేఏసీ నాయకులు బస్టాండ్ ముందు రాస్తారోకో నిర్వహించారు.అరెస్టును తక్షణమే రద్దు చేసి విశారాధన్ మహారాజ్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొంతసేపు రాకపోకలు అంతరాయం కలిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.నిరసనకారులు అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, కోఆర్డినేటర్ సాయి మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ కానుకల పంపిణీ

**ముద్ర, కూకట్‌పల్లి :**

రంజాన్ పండుగ పురస్కరించుకొని భరత్ నగర్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన రంజాన్ కిట్లను టీపీసీసీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ ముస్లింలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఖలీల్, మహమ్మద్ షరీఫ్, బాకీ బాయ్, తూము సంతోష్ మరియు ఇతర కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**ముద్ర , కుషాయిగూడ:**

జీహెచ్ఎంసి 4వ డివిజన్ పరిధిలో కుందన్ పల్లి రామలింగేశ్వర కాలనీలో పలువురు ముస్లిం కుటుంబాలకు మాజీ కౌన్సిలర్ వరగంటి వెంకటేష్ రంజాన్ కానుకలను అందజేశారు కార్యక్రమంలో రాజారెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య, రవీందర్ రెడ్డి ,రమేష్, అబ్బాస్, పాషా, కయూము, ఖాజ, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17.03.2026
www.mudranews.in | @mudranews



వడ్డీ రేట్లు: యెస్ బ్యాంక్
FDలపై సుమారు 7.00% వరకు వడ్డీ. కొన్ని కాల పరిమి తుల్లో ఇంకా ఎక్కువ ఆఫర్లు ఉంటాయి.



# దేశాభివృద్ధిలో జన గణన కీలకం

**- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
దేశాభివృద్ధిలో జన గణన పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిలాష తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో భారత జనాభా గణన – 2027 కు సంబంధించి అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందన్నారు. అధికారులు చేపట్టే జన గణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పన జరుగు తుందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియకు సంబంధించి గృహాల గుర్తింపు, జన గణన వివరాల నమోదులో తప్పులకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందించే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించి, విజయవంతం చేయాలని చెప్పారు. మాస్టర్ ట్రైనర్లు అధికారులకు జన గణనకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, సీపీఓ జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**కూరగాయల సాగు విస్తీర్ణం పెంచాలి..**

జిల్లాలో రైతులు కూరగాయల సాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సోమవారం జిల్లా లోని పలువురు రైతులకు ఉచితంగా ఐదు రకాల కూరగాయల విత్తనాలు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ జిల్లాలో కూరగాయల సాగును పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ విత్తనాలు అర ఎకరంలో సాగు చేయడానికి సరిపోతాయని చెప్పారు. వీటి ద్వారా నాణ్యమైన కూరగాయల ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. రైతులందరూ ఈ విత్తనాలను సాగు చేసేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పంటల అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం అగ్రభాగంలో ఉండాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం అగ్రభాగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. తిమ్మాపూర్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలను సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. విద్యాబోధన ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. అనంతరం స్టోర్ రూమ్ లో సామగ్రిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు మెనూ ప్రకారం భోజనం కల్పించే విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, స్థానిక గురుకుల ప్రిన్సి పాల్ సరిత, అధికారులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా రవాణా చేయెుద్దు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ హెచ్చరించారు. జిల్లాలోని బైంసాలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాసర పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలతో పాటు జేసీబీ, ద్వి చక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ధర్మాబాద్ నుంచి బాసర మీదుగా నిజామాబాద్ కు ఇసుక తరలిస్తున్న క్రమంలో వీటిని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ రవాణాలో తొమ్మిది మందిపై కేసు నమోదు కాగా, ఐదుగురిని రిమాండ్ కు తర లిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ రవాణా వెనుక సూత్రధారిగా ధర్మాబాద్ కు చెందిన షేక్ రవూఫ్ ను గుర్తించామని పేర్కొ న్నారు. గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణాలో కూడా నిందితుడని, ఇతనిపై హత్యాయత్నం కేసు కూడా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా పరిశీలన



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పట్టణంలోని ఈద్గాను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పలువురు కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాను పూర్తి వసతులతో సిద్ధం చేస్తామని తెలిపారు. కౌన్సిలర్లు ఇమ్రా నుల్లా, ముజహిద్, రఫీ, జకీ, ఇర్ఫా న్, కత్తి నరేందర్, పోశెట్టి, గోపు గోపి పాల్గొన్నారు.

## జీపీ సిబ్బందికి వైద్య పరీక్షలు

**మహదేవపూర్, ముద్ర:**
స్థానిక గ్రామపంచాయతీలో సోమవారం సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పరీక్షలు చేసినట్లు సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ తెలిపారు. ఉపసర్పంచ్ తుంగల శ్రీజ, వార్డు సభ్యులు సంతోష్, నల్లభుగా చిన్న సమ్మయ్య, గడ్డం వెంకటేశ్వర స్వామి, చీర్లవంచ చంద్రశేఖర్, ఖురేషి, బిన్ అలీ, నయిమొద్దీన్, హేమలత, కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

**- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్**



**మహదేవపూర్, ముద్ర:**
ఉద్యాన పంటల సాగుతో దీర్ఘకాలిక లాభాలతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం చిట్యాల మండలం గుంటూరుపల్లి లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ భూమిలో ఉద్యాన పంటలు సాగుతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ పంటల సాగుకు నీటి వినియోగం తక్కువగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయలతో రైతులకు నిరంతర ఆదాయం అందిస్తాయని చెప్పారు. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం, ఆయిల్ పామ్ పథకం, ఉద్యాన మిషన్ వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి యూరియా యాప్ వినియోగంపై వివరించారు. డ్రిప్ కంపెనీ ప్రతినిధులు కుమార్ , పరీక్షిత్ డ్రిప్ సాగు విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, ఆయిల్ పామ్ ప్రతినిధులు సాయి, ప్రీతం, గవాస్కర్, పరిపూర్ కంపెనీ ప్రతినిధి పూర్ణచందర్, కుమార్, డ్రిప్ కంపెనీ ప్రతినిధి సమ్మయ్య, రైతులు కొంక హనుమంతరావు, పువ్వాటి సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్



**ముద్ర, కరీంనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాకుండా ప్రజలను మోసం చేస్తోందని కరీంనగర్ బీజేపీ జోన్ నేతలు ఆరోపించారు. సోమవారం కరీంనగర్ బీజేపీ ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ జోన్ల ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరీంనగర్ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జోన్ అధ్యక్షుడు జాడి బాల్ రెడ్డి, తణుకు సాయి కృష్ణ, పాదం శివరాజ్, బండారి గాయత్రి అవదుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం అటకెక్కించిందన్నారు. రైతు భరోసా కు భరోసా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్యారంటీల ను వెంటనే అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జా శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు బండా రమణ రెడ్డి , ఒంటెల సత్యనారాయణ రెడ్డి, సోమిడి వేణు, మేకల వెంకటేష్, మాసం గణేష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు వరాల జ్యోతి, బండి ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాంపల్లి శ్రీనివాస్, దేవసాని సత్యం, పొన్నం మొండయ్య, పెద్దపల్లి జితేందర్, రాగి సత్యనారాయణ, కదర్ల విమల్ కుమార్, అన్నాజీ వినీత్ కుమార్, ఉప్పరపల్లి శ్రీనివాస్, మంగళ రవిగోపాల్, దెయ్యాల మల్లేశం, విష్ణు ప్రసాద్ రావు, కేశవ రెడ్డి, పాశం తిరుపతి, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం వైఫల్యంతోనే గ్యాస్ ధరల పెంపు

**ముద్ర, నిర్మల్:** కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే గ్యాస్ ధర లు పెరిగాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రమే ష్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో గ్యాస్ ధరల పెంపు, కొరతను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధ ఫలితంగా మన దేశంలో గృహ అవసరాల గ్యాస్ ధర రూ.60 పెరిగా యన్నారు. దేశంలో పెట్రోల్, గ్యాస్ కు కొరత లేదని బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు అబద్ధమన్నారు. గ్యాస్ సరఫరా తగ్గిపోయి ప్రజలకు ఇబ్బందుల ఏర్పడ టంతో పాటు హోటళ్ల మూతకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోవడమే కారణమన్నారు. గతంలో మనకు రష్యా నుంచి చౌకగా లభిస్తున్న చమురును అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం కేంద్ర ప్రభుత్వం వదులు కుంద న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎస్.ఎన్.రెడ్డి, రాజేశ్వర్, పుండ లిక్, ముత్యం, నారాయణ, శివ కుమార్, నజీర్, అనంతరావు, ప్రజా సంఘ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి బాధితులకు అండగా నిలవాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:**
సమస్యల పరిష్కారం కోసం ఎంతో దూరం నుంచి ప్రజావాణికి వచ్చి విన్నవించే బాధితులకు అధికారులు అండగా నిలవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి లో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వినతి పత్రాలను స్వీకరించారు. బాధితులు చెప్పిన సమస్యలను ఆలకించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 290 దరఖాస్తులు వచ్చాయి. దర ఖాస్తులను ఓపిగ్గా పరిశీలిస్తూ సమస్యలు ఆలకిస్తూ బాధితుల్లో కలెక్టర్ భరోసా నింపారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి దరఖాస్తులను స్వీకరించారు. ఇటీవల బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని సరికొత్తగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వెంటనే పరిష్కారం అయ్యే దరఖాస్తులపై సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమయం తీసుకునే దర ఖాస్తులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజావాణి దరఖాస్తులపై అధికారులకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే కరీంనగర్ ఆర్డీఓ కే మహేశ్వర్, హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల ఆందోళన


**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశా వర్కర్లు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వంటావార్పు నిర్వహించడంతో పాటు రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తుడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత, జిల్లా కోశాధికారి లక్ష్మి , ఉపాధ్యక్షులు విజయ, చంద్రకళ, సుగుణ ఇంద్రమాల, నంద పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన అవసరం

**- పర్యావరణ శాస్త్రవేత్త తిరుపతి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురవుతున్న అనర్థాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త తిరుపతి సూచించారు. నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని జీపీఎల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సింగిల్ యూసేజి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల ప్రజల్లో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మన నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని రోజురోజుకు పెంచుకొంటూ అనేక ఇబ్బందులను కొనితెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ లాంటి అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. సింగిల్ యూసేజి ప్లాస్టిక్ నిషేధంలో ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలని కోరారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ మార్గాలను ఆయన విద్యార్థులకు వివరించారు. సీపీసీబీ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన బయో–డిగ్రేడబుల్ సంచుల వివరాలను వివరించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్ మృతి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలోని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద నాయక్ సోమవారం సాయంత్రం మృతి చెందారు. కొంత కాలంగా అస్వస్థతతో ఉన్న అజ్మీరా గోవింద నాయక్ దండేపల్లి మండలం లింగాపూర్ లోని తన నివాసంలో మృతి చెందారు. ఆయన ఖానాపూర్ ఎమ్మెల్యే గా మూడు పర్యాయాలు గెలుపొందారు. తొలిసారి ఇండిపెండెంట్ గా గెలుపొందిన గోవింద్ నాయక్ అనంతరం టీడీపీ, బీఆర్ ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగారు.

### వడ్డీ రేట్లు: ఇండస్ ఇండ్ బ్యాంక్

ఫిక్స్ డ్ డిపాజిట్ల పై సుమారు 6.90% వరకు వడ్డీ. సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.5% వరకు ఎక్కువ వడ్డీ ఉంటుంది.




### వడాయిగూడెం భూ సమస్యను

## ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

**- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సర్వే నం. 518 భూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ సోమవారం హైదరాబాద్‌లో మల్లన్నను కలిసి కోరారు. సర్వే నం.518 భూములకు సంబంధించిన వివాదాలపై ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్వే నం.518లో కేవలం 20 ఎకరాల భూదాన్ భూమి ఉంటే మొత్తం 467 ఎకరాలను నిషిద్ధ జాబితాలో పెట్టడం వల్ల రైతులు, సామాన్యులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. జనావాసాలు ఉన్న ప్రాంతాలను కూడా బ్లాక్ చేయడం వల్ల ఇండ్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

తీన్మార్ మల్లన్న స్పందిస్తూ భూభారతి లోపాలు, రెవెన్యూ అధికారుల పొరపాట్ల వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడటం అన్యాయమని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుక్కల దుర్గయ్య యాదవ్, ఉమ రమేష్, కోట దీప, కోట సుధాకర్, కోట సుధావాణి, గ్రామ నాయకులు బబ్బూరి సాగర్ గౌడ్, రాసాల రాజు యాదవ్, బొజ్జ సాంబేష్, నీల మనీష్ గౌడ్ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్ ను పరిశీలించి గత నెలలో ఈ ఆసుపత్రిలో ఎన్ని సాధారణ ప్రసవాలు జరిగాయని తెలుసుకున్నారు. కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులను తిరుగుతూ, పేషెంట్ల వద్ద కు వెళ్లి వారి ఆరోగ్యం పరిస్థితు లను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, ఎంతమంది టీచర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని, ఎప్పటికప్పుడు తాజాగా ఉన్న కూరగాయలు మాత్రమే వంటకు ఉపయోగించాలన్నారు. 10వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు కలెక్టర్ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ కూలర్ బహూకరణ



**ముద్ర, బీబీనగర్:**


బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ అభిమానులు వాటర్ కూలర్ ను బహూకరించారు. కాంగ్రెస్ నేత శ్యామ్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వివిధ ఆలయాలలో పూజాదికాలు నిర్వహించిన ఆయన అభిమానులు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో చల్లటి మంచి నీరు అందించడానికి వీలుగా కూలర్ ను అందించారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, బీబీనగర్ సర్పంచి పంజాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచి గోలి నర్సింహారెడ్డి, నాయకులు సందిగారి బస్వయ్య, గోలి నరేందర్ రెడ్డి, కాసుల ఆంజనేయులు గౌడ్, బొమ్మగోని బస్వయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కౌన్సిలర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పట్టణ పరిధిలోని సింగన్నగూడెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం 9వ వార్డు కౌన్సిలర్ బొంతల నర్సింగ్ రావు సందర్శించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం అందించే పోషక ఆహార పదార్థాలను పరిశీలించి అంగన్వాడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఆయా పాల్గొన్నారు.

### ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీని సన్మానించిన చైర్ పర్సన్



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డిని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలిమినేటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావివ్వకుండా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి కి కృషి చేయాలన్నారు.

### కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల

## సమస్యలు పరిష్కరించాలి

**- టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో, యుఆర్ఎస్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు, కేజీబీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ లక్ష్మి మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 29 రోజుల సమ్మె కాలానికి వేతనాన్ని వెంటనే విడుదల చేసి మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేస్తూ, నైట్ డ్యూటీలను మినహాయింపు చేసి కేర్ టేకర్లను నియమించాలని, ఈ నెల 20 లోపు ప్రభుత్వం స్పందించకుంటే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ వెంకటాచారి, కేజీబీవీ జిల్లా కన్వీనర్ కే కవిత, యుఆర్ఎస్ నాయకులు యాకయ్య, ఎస్ఎస్ఏ నాయకులు నాగార్జున, పాండు, స్వామి, టీఎస్ యూటీఎఫ్ నాయకులు సుదర్శన్ రెడ్డి, డి వెంకన్న, డి రవి, అంజయ్య, ఎల్లయ్య, సోమయ్య, వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




## 'ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి'

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

జిల్లాలోని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన అధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సి), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సి హెచ్ సి), ఏరియా హాస్పిటల్స్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు తప్పనిసరిగా (నేషనల్ క్వాలిటీ అస్సూరెన్సు స్టాండర్డ్స్) సర్టిఫికేషన్ పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి 31 లోపల అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇంటర్నల్ అసెస్మెంట్ పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే సర్టిఫికేషన్ పొందిన 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రీ–సర్టిఫికేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో అన్ని ఆసుపత్రులలో నిర్మాణంలో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు.



ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. మనోహర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాండు నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సహజయోగ ధ్యానంతో అన్ని సాధ్యం




**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కలాశాలలో సహజయోగ ధ్యాన పరిచయం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొనగా రాష్ట్ర సమన్వయ కర్త గౌరీ కృష్ణ సత్యాన్వేషకులకు సహజ యోగ గురించి ప్రసంగించారు.

### బీఏస్సీ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

హైదరాబాద్ లోని అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్ లో నిర్వహించిన బీఏస్సీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో కలసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

**- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్, ఎం.ఏ రహీం అంజుమన్ ఇస్లాఉల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అన్నారు. సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు యుద్ధం వద్దు శాంతి కావాలి అని నినాదంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలతో యుద్ధం చేస్తుందని విమర్శించారు. యుద్ధం వల్ల అన్ని దేశాలపై ధరల ప్రభావం పడుతుందని చమురు ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి పోయి ప్రజలపై భారాలు పడతాయన్నారు. అమెరికా చేస్తున్న యుద్ధంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడాలని అన్నారు.




అమెరికా భారతదేశం మీద అనేక విధాలుగా సుంకాల పేరుతో పన్నులు పెంచుతున్న కనీసం నోరు మెదపకుండా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసం ఘాల నాయకులు శేక్ హమీద్ పాష, సామాజిక చైతన్య సమితి అధ్యక్షుడు శ్రీనివాసాచార్యులు, సామ మల్లారెడ్డి, చిన్నయ్య, జిట్టా భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్టల బాలరాజు, సిపిఎం పార్టీ నాయకులు కల్లూరి మల్లేశం, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏవి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు చెన్నా మహేష్ స్వాతి, నాకోటి నగేష్, చీమల రాజు, ఏలే భువనేశ్వరి శివ, ప్రజా సంఘాల నాయకులు, యస్.ఎఫ్.ఐ నాయకులు లావుడియా రాజు పాల్గొన్నారు.

## 'బిగ్ మార్ట్' మొబైల్ యాప్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణ ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులను చేరవేసే లక్ష్యంతో రూపొందించిన 'బిగ్ మార్ట్' మొబైల్ యాప్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యువ టీమ్ సభ్యుడు మచ్చ భరత్ తన సొంత మేధస్సుతో ఈ యాప్ ను రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, 28 వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత, పీసీసీ మాజీ కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు చల్లగురుగుల రఘు బాబు, జాలిగం విగ్నేష్, నర్సింగ్, జంగిటి వినోద్, యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, పట్టణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




### శాంతియుత వాతావరణంలో

## పండుగలు నిర్వహించుకోవాలి



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పండుగటు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతి నెలకొల్పే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని భువనగిరి పట్టణ ఎస్ఐలు లక్ష్మినారాయణ, లక్ష్మినర్సయ్యలు అన్నారు. సోమవారం రంజాన్ పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణవాసులు శాంతి స్థాపనకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైతే శాంతిభద్రతలు సక్ర మంగా ఉంటాయో, అక్కడ వ్యాపార వాణిజ్యాలు అభివద్ధి పథంలో ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పట్టణంలోని ముస్లీం నాయకులు హాజరై శాంతి సామరస్యానికి అవసరమైన సూచనలు చేశారు.

## ఇరాన్ పై యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలి

**- సీపీఐ ఆధ్వర్యంలో నిరసన**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ యుద్ధం వల్ల దేశంలో పెట్రోల్ గ్యాస్ కొరత ఏర్పడి ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే యుద్ధాన్ని నిలిపివేయాలని దీనికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. యుద్ధం వద్దు ప్రపంచ శాంతి ముద్దు అని అన్నారు. యుద్ధం ఇదే విధంగా కొనసాగితే రాబోయే కాలంలో గ్యాస్ ఇంధన కొరతతో పాటు ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య అధ్యక్షత వహించగా సీపీఐ నాయకులు కోట శంకర్, చొప్పరి సత్తయ్య, ముసునూరు చంద్రశేఖర్ ఎండి బాబా, ఎండి ముస్తఫా, గుజ్జ సత్యనారాయణ, కూరాకుల అబ్బులు, నాగపురి యాదగిరి, అంకం నగేష్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





వడ్డీ రేట్లు : ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

ఎఫ్డీపై సుమారు 7.20% వరకు వడ్డీ అందిస్తుంది. ఎక్కువ కాలం డిపాజిట్ చేస్తే రేటు మరింత పెరుగుతుంది.



## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ పాండు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు, వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి వినతిని నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

## తమ్ముడి మృతికి కారణమైన అన్న అరెస్టు




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

తమ్ముని మృతికి కారణమైన అన్నను సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలోని బోయిగల్లికి చెందిన వంగలి రాములు, వంగలి ప్రభు, వంగలి కొండలు అన్నదమ్ములు. వీరికి సంబంధించిన పాత ఇల్లు అమ్మడానికి దరఖాస్తు చేసుకున్నారు. వంగలి కొండలు మిగతా ఇద్దరు అన్నదమ్ములకు డబ్బులు చెల్లించాడని, కానీ ఇంటిని కొండల పేరు మీద మార్చడానికి డబ్బులు తీసుకున్నప్పటికీ రాములు సంతకం చేయకుండా వేధింపులకు గురి చేశాడని తెలిపారు. వారి అమ్మమ్మకు చెందిన 60 గజాల భూమిని ఎవరికి తెలియకుండా వంగలి రాములు తన భార్య చంద్రకళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. దీనిపై ప్రశ్నించడంతో కొండలును రాములు, అతని భార్య చంద్రకళ తిట్టి అవమానించారని చెప్పారు. ఈ అవమానాన్ని భరించలేక ఈ నెల 15వ తేదీన వంగలి కొండలు పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొండలు మరణించాడని తెలిపారు. మృతుని రెండవ అన్న వంగలి ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టూ టౌన్ ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం నిందితులు వంగలి రాములు, అతని భార్య చంద్రకళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

## యుద్ధ ప్రభావం.. రెట్టింపైన గ్యాస్ బుకింగ్‌లు



**ముద్ర న్యూస్ :**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లు ఒక్కసారిగా పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో గ్యాస్ ఏజెన్సీలో నిత్యం 500 నుంచి 600 వరకు ఉండే బుకింగ్‌లు ప్రస్తుతం 1500కు పైగా నమోదవుతున్నాయి. మండల కేంద్రాల్లో కూడా 150-200 వరకు ఉండే బుకింగ్‌లు ఇప్పుడు దాదాపు రెట్టింపయ్యాయి. అయినప్పటికీ కంపెనీలు అదనంగా సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణంగా రెండు నుంచి మూడు నెలలకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వినియోగదారులు ప్రస్తుతం వరుసగా బుకింగ్‌లు చేస్తున్నారు. డబుల్ కనెక్షన్లు, అదనపు సిలిండర్లు ఉన్న వారు రెండేసి సిలిండర్లు బుక్ చేసుకోవడంతో సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 5000 నుంచి 6000 వరకు బుకింగ్‌లు నమోదవుతుండగా, సుమారు 4500 సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. ఇక కొన్ని గ్రామాల్లో డెలివరీ బాయ్‌లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బుకింగ్ లేకపోయినా సిలిండర్ ఇవ్వాలని కొందరు గ్రామస్తులు పట్టుబడుతున్నారని ఏజెన్సీ సిబ్బంది చెబుతున్నారు. బిల్లు తీసిన తర్వాత వినియోగదారుడి ఫోన్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేసిన తర్వాతే సిలిండర్ ఇవ్వాల్సి ఉండగా, కొందరు వినియోగదారులు ఓటీపీ చెప్పకపోవడం వల్ల కూడా సరఫరాలో జాప్యం జరుగుతోంది. మరోవైపు గృహవినియోగ సిలిండర్లను కొందరు హోటళ్లు, బేకరీలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నారు. శనివారం ఒక్కరోజే 30 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు నమ్మి అనవసరంగా బుకింగ్‌లు చేయవద్దని డీఎస్‌వో వెంకటేశ్వర్లు సూచించారు.

# ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించి బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. వీరంతా మహిళలే కాగా, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారన్నారు. నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస గ్యారంటీ ఫిక్సిడ్ వేతనం కూడా ఇప్పటివరకు నిర్ణయించలేదన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు 15 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ వేతనాలు పెంచలేదన్నారు. రూ. 50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. పిఆర్సీ, ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీ డబ్బులు ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటికి తోడు పారితోషికాలు కూడా ప్రతి నెలా సమయానికి రావడం లేదని చెప్పారు. దీంతో ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, అమ్ముల బాలార్సయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, మామిడాల కనకయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ, కోశాధికారి భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు సంతోషి, శ్యామల, కవిత, మాలతి, రేణుక, భాగ్యలక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- కలెక్టర్ హైమావతి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయంలోని మీటింగ్ హాల్‌లో రీజనల్ రింగ్ రోడ్డు వల్ల భూమి కోల్పోతున్న జగదేవ్‌పూర్ మండలం చెబర్తి, అల్రాజీపేట, పిర్లపల్లి, ఇటీక్యాల గ్రామాల రైతులతో ఆర్బిట్రేషన్ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్ వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం శుభపరిణామమన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న రైతులకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



## వడగళ్ల వర్షం



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

అల్పపీడన ప్రభావంతో సోమవారం సాయంత్రం మెదక్ జిల్లాలో వడగళ్ల వర్షం కురిసింది. జిల్లా సరిహద్దు హవెలి ఘనపూర్ మండలం పోచమ్మరాల్, నాగపూర్, బూరుగుపల్లి గ్రామ శివార్లలో వడగళ్ల వాన పడింది. వడగళ్లు పడడంతో వరి పంటలు పొట్ట దశలో ఉన్న సమయంలో నష్టపోతాయని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రానున్న రెండు మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో, చేతికొచ్చే పంట దెబ్బతింటుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# సిద్దిపేట యువతకు సువర్ణావకాశం

- వచ్చే నెలలో భారీ జాబ్ మేళా
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో వచ్చే నెలలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో జిల్లాలోని పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ఇప్పటికే 20కి పైగా ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఎవరైనా ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఏదైనా విద్యా అర్హత కలిగిన వారికి వారి నైపుణ్యానికి తగ్గట్టుగా అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. సామాజిక బాధ్యతగా యువతకు అండగా నిలవాలనుకునే మరిన్ని కంపెనీలు ఈ చొరవలో భాగస్వామ్యం కావాలని, ఆసక్తి గల సంస్థలు సిద్దిపేట పోలీసులను సంప్రదించాలని సీపీ కోరారు. జాబ్ మేళాలో పాల్గొనదలిచిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లతో పాటు విద్యార్హతలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ లింక్ ఈ నెల చివరలో విడుదల చేయబడుతుందని తెలిపారు. జిల్లాలోని యువత తమ ప్రతిభను చాటుకుని స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ రష్మీ పెరుమాళ్ కోరారు.

## బెల్టు షాపులు మూసివేయాలని ఎక్సైజ్ సీఐకి వినతి

**ముద్ర న్యూస్ :**

మద్యం బెల్టు షాపులను మూసివేయాలని ఎక్సైజ్ సీఐ షకీర్ అహ్మద్‌కు ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతుండటంతో నిత్యం గొడవలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సీఐని కలసిన వారిలో లింగపురం సాయిలు, కన్నెబోయిన రాజు, జక్కుల సంతోష్ కుమార్, పోతుగంటి సాయిలు తదితరులు ఉన్నారు.

# వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



- పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ పురపాలక సంఘం పరిధిలోని 5, 16, 17 వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, అసిస్టెంట్ ఇంజనీర్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సిబ్బంది, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వడ్డీ రేట్లు : ఆక్సిస్ బ్యాంక్**

FDలపై సుమారు 6.45% వరకు వడ్డీ. సీనియర్ సిటిజన్లకు సుమారు 6.95% వరకు లభిస్తుంది.






## విపక్ష సభ్యులకు దీటుగా సమాధానమివ్వండి

- **సభలపై నిర్లక్ష్యం వద్దు.. సభ్యులందరూ సభకు హాజరుకావాల్సిందే**
- **వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలి**
- **వారికి మంత్రులు సమయమివ్వాలి**
- **గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయింది**
- **గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్**
- **సీఎల్పీ భేటీలో కాంగ్రెస్ సభ్యులకు సీఎం దిశానిర్దేశం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సీఎల్పీ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాలల్లో అనుసరించాల్సిన వ్యూహంపైన సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని ఇక మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే దానిపై దృష్టిసారించాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడవ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదన్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ ప్రసంగంలో వివరించారని చెప్పారు. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృధా కాకుండా సమర్ధవంతంగా నడిపేలా చూడాలని సీఎం సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు సబ్జెక్ట్ మాట్లాడటానికి కూడా సమయం ఇవ్వలేదని సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని, సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరం అని సీఎం చెప్పారు.


**పూర్తి స్థాయిలో అసెంబ్లీ కమిటీలు**

అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సీఎం తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుందని తెలిపారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలన్నారు. ఇది మన ప్రభుత్వం ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై సభ్యులు ఫోకస్ పెట్టాలని, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని ఆదేశించారు.

# పట్టణాల్లోని పేదలకు గుడ్ న్యూస్

- **20 వేల ఇళ్లకు గ్రీన్ సిగ్నల్**
- **త్వరలోనే కేటాయింపు**
- **నిధులు విడుదల**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణలోని పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్రం 'PMAYU 2.0' కింద 20 వేల ఇళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు రూ. 300 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆ ఇళ్లను పట్టణాల్లోని పేదలకు కేటాయించనున్నారు. హైదరాబాద్ సహా ఇతర కార్పొరేషన్లలోని నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తూ.. అసంపూర్తిగా ఉన్న 29 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పూర్తి చేసి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణలోని పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ పథకం అమలవుతోంది. పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కావటం లేదు. ఈ నేపథ్యంలో పట్టణ పేదలకు సొంత గూడు కల్పించే దిశగా రేవంత్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0' పథకం కింద దాదాపు 20 వేల ఇళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు, సుమారు రూ.300 కోట్ల నిధులను విడుదల చేసింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలోని పేదలకు ఈ పథకం నిధులతో ఇందిరమ్మ ఇళ్లను భారీ స్థాయిలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు ఖమ్మం, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికలకు ముందే ఈ పథకాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల నిర్వహించిన సర్వేలో దాదాపు 9 లక్షల కుటుంబాలకు సొంత భూమి లేదని తేలింది. వారందరూ ప్రస్తుతం అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారని సర్వేలో గుర్తించారు. వీరిలో 2 లక్షల కుటుంబాలు రేకుల షెడ్లు, పూరి గుడిసెల్లో మగ్గుతున్నట్లు అధికారులు గుర్తించారు. వారందరికి ఈ పథకం కింద సొంత గూడును కల్పించనున్నారు. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 29 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పూర్తి చేసే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంది. ఇందుకోసం రూ.1 కోట్లను వెచ్చించి మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఇప్పటికే 5 వేల ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉండగా.. మిగిలిన 24 వేల యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికి 5 వేల కుటుంబాలకు గృహ ప్రవేశాలు చేయించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో పక్షపాత రాజకీయం జరుగుతోందన్న ప్రతిపక్షాల ఆరోపణలను అధికారులు కొట్టిపారేస్తున్నారు. కారు లేదా ఏసీ వంటి ఆస్తులు లేని అత్యంత నిరుపేదలనే ఆర్థిక స్థితిగతుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు. కేంద్రం 20 వేల ఇళ్లకు అనుమతి ఇచ్చిందంటేనే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉందనడానికి నిదర్శనమని చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడిస్తున్నారు.

# తెలంగాణ వైద్య రంగంలో నూతన సంస్కరణలు

- **నకిలీ డాక్టర్లకు గట్టి చెక్.. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ఇక ఆన్‌లైన్‌లోనే**
- **ప్రైవేటు హాస్పిటళ్లపై కఠిన నిబంధనలు.. ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం**
- **ఫేక్ క్లినిక్‌లపై ప్రభుత్వం కఠిన చర్యలు**
- **హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరి రిజిస్ట్రేషన్**
- **డాక్టర్లు, సేవలు, ఛార్జీలు అన్నీ ఆన్‌లైన్‌లో వెల్లడించాలి**
- **పైలట్‌గా సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో ప్రారంభం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ప్రతి హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ విధానం ద్వారా ఫేక్ డాక్టర్లు, అనధికారిక క్లినిక్‌లకు అడ్డుకట్ట వేస్తూ హాస్పిటల్ పూర్తి వివరాలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

తెలంగాణలో నకిలీ వైద్యులు ఎక్కువైపోయారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 250 నకిలీ హాస్పిటల్స్ ఉన్నట్లు తేలింది. అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతూ.. కాసుల కోసం హాస్పిటల్స్ ఓపెన్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ వైద్యానికి చెక్ పెడుతూ.. ఆన్‌లైన్‌లోనే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. ప్రైవేటు హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరిగా అవి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది.

**రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం జిల్లా వైద్యాధికారి ఆఫీసుకు వెళ్లాలనే నిబంధన ఉంది. ఈ విధానం వల్ల పలు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అనధికారికంగా ఆసుపత్రులను నడిపిస్తున్నారు. అటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో ఇటీవల పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ఫిజియోథెరపీ కేంద్రాలు కూడా సీఈఏను పట్టించుకోవడంలేదని తెలిసింది. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా సర్కారు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ సీఈఏ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో తాజాగా పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు.

ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కోసం కాలుష్య నియంత్రణ మండలి ధ్రువీకరణ పత్రం, బయోమెడికల్ వ్యర్థాల వివరాలు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు, పనిచేసే డాక్టర్లు, నర్సులు.. వారి అర్హత, అందిస్తున్న సేవలు.. వైద్య సేవల ధరలు, పడకల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేశాక జిల్లా వైద్యాధికారి పరిశీలించి కలెక్టర్‌కు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కలెక్టర్ పరిశీలించి అనుమతికి అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రస్తుతం కొన్ని అలోపతి హాస్పిటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా హోమియో డాక్టర్లు కూడా పనిచేస్తున్నారు. ఆర్ఎంపీలు అర్హత లేకున్నా హాస్పిటల్స్ నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ కావడం వల్ల ఇకపై ఇలాంటి వాటికి కూడా అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ప్రజలు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి సకల సమాచారం ఆన్‌లైన్‌లోనే చూసేలా పోర్టల్ అభివృద్ధి జరుగుతోందని చెబుతున్నారు.

## రబీ సీజన్ లో 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు

- **54.48 లక్షల ఎకరాల్లో 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా**
- **రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**
- **గ్రేడ్-ఏ కు క్వింటాల్ కు 2,389 మద్దతు ధర ఇచ్చేందుకు నిర్ణయం**
- **రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




202526 రబీ సీజన్ లో ముందెన్నడూ లేని రీతిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రబి సీజన్లో54.48 లక్షల ఎకరాల్లో 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ,కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాట్లపై సోమవారం ఉదయం బేగంపేట లోని ఐ.ఏ.ఎస్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి అదనపు కలెక్టర్లు,జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు, ఆయా జిల్లాల సివిల్ సప్లయ్స్ మేనేజర్లతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 202526 రబీ సీజన్లో ఉత్పత్తి అయిన ధాన్యం దిగుబడిలో వ్యవసాయ రంగ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సమగ్రమైన కార్యాచరణను రూపొందించామని చెప్పారు. అందులో 60 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం,30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నాలు ఉంటాయన్నారు. ధాన్యం కొనుగోలులో రైతాంగానికి ఎక్కడా అవాంతరాలు ఎదురు కాకుండా ఉండేందుకు ధాన్యం ఉత్పత్తికి తగ్గట్టు రాష్ట్ర వ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. చదానికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రప్రభుత్వం నిర్ణయానుసరంగా మద్ధతు ధర చెల్లించేందుజు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గ్రేడ్ఏ,సాదారణ విభాగలుగా గుర్తించి గ్రేడ్ఏ కూ2,389,సాధారణ వరికి 2,369 చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా పెరిగిన మద్ధతు ధరతో రైతాంగానికి పెద్ద ఎత్తున లబ్ది చేకూరుతుందని మంత్రి చెప్పారు. తద్వారా రైతాంగానికి ఆదాయం పెరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను పెంచడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ షీట్లు,ఎలక్ట్రానిక్ తుకాలు ,తేమను కొలిచే పరికరాలు, ఆటోమేటిక్ వరి క్లినర్లు,డిజిటల్ డయల్ కాలిపర్స్, హస్క్ రిమువర్ల తో పాటు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు సత్వరం ధాన్యాన్ని సరఫరా చేసేందుకు సరిపడా వాహనలా ఏర్పాట్లను ముందుగానే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దానికి తోడు వేసవి తీవ్రత ను దృష్టిలో పెట్టుకుని రైతాంగానికి ఎక్కడ ఇబ్బందులు ఎదురు కాకుండా చూడడంతో పాటు ఎండ వేడిమికి వడ దెబ్బ తగలకుండా నివారణ చర్యల నిమిత్తం తక్షణ ఉపశమనం కోసం ఓ.ఆర్.ఎస్ వంటివి ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట పంటకు దిగుబడి రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి పెరుగుతుందని ఖరీఫ్ సీజన్ కు తాజా రబీ సీజన్ కే ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

## కలెక్టరేట్ల ఎదుట ఆశాల నిరసన ప్రదర్శన

- **ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**
- **బీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య డిమాండ్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి/నాగర్ కర్నూల్:**



తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, నల్ల బ్యాడ్జీలు ధరించి వికారాబాద్, నాగర్ కర్నూల్ కలెక్టరేట్ల ఎదుట సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆయా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులను కలసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వికారాబాద్ లో బీఆర్‌టీ యు రాష్ట్ర నాయకులు టైగర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా 50 లక్షలు ఇవ్వాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన ఆశాలకు ఏఎన్ఎం పోస్టులు ఇవ్వాలని, ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఇండ్లు లేని నిరుపేద ఆశలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కనీసం ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలని, రిటైర్డ్ ఆషా లకు నెలకు 10వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌తివారికి వినతిపత్రం ఇవ్వగా, తప్పకుండా తన పరిధిలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి స్వర్ణ కుమారి మాట్లాడుతూ పెండింగ్ జీతాలు వచ్చిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిత, జ్యోతి. చంద్రాకల, రంజిత, యాదమ్మ, వెంకటమ్మ, గంగ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ లో..**

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు వంటావార్పు నిర్వహిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. పారితోషికాలు అడిగితే ఆశాలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం సరైంది కాదని మండిపడ్డారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆశాలకు ఫిక్స్డ్ వేతనం, గ్రాట్యుటీతో పాటు 180 రోజుల ప్రసూతి సెలవులు అమలు చేస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు అమలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు స్వప్న, శ్రీదేవి, కృష్ణవేణి, రత్నమాల, నారమ్మ, తార, ఉమారాణి, సువర్ణ, లక్ష్మీ, చంద్రకళ, వరలక్ష్మి, శశికళ, నర్మద, శివలీల, శారద, రాధ, సునీత, కవిత, వెంకటేశ్వరమ్మ, జ్యోతి, రాధిక, సుగుణమ్మ పాల్గొన్నారు.

**వడ్డీ రేట్లు : పంజాబ్ నేషనల్ బ్యాంక్**

FDలపై గరిష్టంగా 6.60% వరకు వడ్డీ. సీనియర్ సిటిజన్లకు 7.10% వరకు ఉంటుంది.



# ఏఆర్ కానిస్టేబుల్ హత్య

- **ఇద్దరు నిందితుల అరెస్ట్**

**ముద్ర, మల్కాజిగిరి:**

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పోలీసులు చురుకుగా స్పందించి ఏఆర్ కానిస్టేబుల్ హత్య కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు నిందితులను కేవలం 6 గంటల్లోనే అరెస్టు చేశారు. ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీ నివాసి ఏఆర్ కానిస్టేబుల్ సుధీర్ కుమార్(39) అతని స్నేహితులు మధ్య ఆదివారం రాత్రి మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో సంతోష్, తరుణ్ విచక్షణారహితంగా సుధీర్ కడుపులో కత్తులతో పొడిచి దారుణ హత్య చేశారు. మేడిపల్లి నివాసి కానుపూర్ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్చి 15 రాత్రి సుమారు 8.37 గంటల సమయంలో పృధ్వీరాజ్ అనే వ్యక్తి ఫోన్ చేసి, చిలకానగర్ ప్రాంతంలో తన బావ పరువుల సుధీర్ కుమార్, బానోతు సంతోష్ మధ్య గొడవ జరుగుతోందని తెలిపాడు. సమాచారం అందుకున్న శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకోగా, సుధీర్ కుమార్ రక్తపు మడుగులో పడి కనిపించాడు. పోలీసుల దర్యాప్తులో మృతుడు సుధీర్ కుమార్, నిందితుడు సంతోష్ మధ్య గతంలోనే వివాదాలు ఉన్నట్లు బయటపడింది. మార్చి 15 సాయంత్రం 7:30 గంటల సమయంలో నిందితుడు సంతోష్ తన స్నేహితుడు పొడిశెట్టి తరుణ్‌తో కలిసి సుధీర్‌ను చిలకానగర్ మైదానానికి రమ్మని పిలిచాడు. సుధీర్ తన స్నేహితుడు ఇమ్రాన్ ఖాన్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై అక్కడికి వెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన సంతోష్ కత్తి తీసి సుధీర్‌ను పొడిచాడు. అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన సుధీర్‌ను సంతోష్, తరుణ్ ఇద్దరూ వెంబడించి పలుమార్లు కత్తితో దాడి చేయడంతో సుధీర్ సంఘటనా స్థలంలోనే మరణించాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులు బోనోతు సంతోష్, పోడిశెట్టి తరుణ్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఒక కత్తిని, రెండు ఫోన్లను, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఉప్పల్ సీఐ రామలింగారెడ్డి తెలిపారు.



# ఏఎన్ఎంల జీతాలలో కోత విధించడం అన్యాయం

- **ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ**

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

మేడ్చల్ జిల్లాలోని యూపీహెచ్ సీ, పీహెచ్ సీలలో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు మేడ్చల్ డీఎంఅండ్ హెచ్ వో జీతాలు కట్ చేయడం అన్యాయమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. ఏఎన్ఎంల జీతాలలో కోతలు విధించడానికి నిరసిస్తూ సోమవారం మేడ్చల్ డీఎం అండ్ హెచ్ వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. జిల్లా అధికారుల తీరు రాష్ట్రమంతా ఒక విధంగా ఉంటే ఇక్కడ మాత్రం తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఉద్యోగులకు ముందస్తుగా ఎలాంటి కౌన్సిలింగ్ నిర్వహించకుండా తమ చేతుల్లో అధికారం ఉంది కదా అని వారి జీతాలను కట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు కాంట్రాక్టు ఏఎన్ఎంలు రెండు నెలలుగా జీతాలు రాక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుండగా సంబంధిత డీఎంహెచ్వో ఆ విషయాలను పట్టించుకోకుండా చిన్నచిన్న తప్పిదాలను చూపి ఉద్యోగుల పొట్టలు కొట్టడం తీవ్ర ఆక్షేపనీయమన్నారు. ఏఎన్ఎంల జీతాల కోతలు నిరసిస్తూ రేపు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు డీఎంఅండ్ హెచ్వో నిరంకుశ విధానాలను కమిషనర్ కు వివరించనున్నట్లు తెలిపారు. ఫీల్డ్ స్థాయి ఉద్యోగులు అయినందున రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆధార్ బేసుడు అటెండెన్స్ అమలు కావడం లేదని అన్నారు. వారి జీతాలు వచ్చే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డిఎంహెచ్వో కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని యూపీహెచ్సీ, పీహెచ్‌సీ ఏఎన్ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండచెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- **హైడ్రా కమిషనర్‌రంగనాథ్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి**

**ముద్ర, మల్కాజిగిరి:**

మల్కాజిగిరి నియోజకవర్గంలోని బండచెరువును పరిరక్షిస్తూ ఆధునికరించాలని హైడ్రా కమిషనర్ ఎ .వి.రంగనాథ్ ను కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం బుద్ధభవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. చెరువులో ప్రస్తుతం పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్త, మట్టిపొరలు కారణంగా చెరువు పర్యావరణం దెబ్బతింటోందని, దీనివల్ల స్థానిక ప్రజలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించి, చెరువును పరిరక్షిస్తూ ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతిపత్రంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని చెరువులు, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.



# ఆస్కార్ అవార్డుల పంట





- **ఆస్కార్ 2026లో 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' హవా**
- **ఆరు అవార్డులతో టాప్‌లో నిలిచిన హాలీవుడ్ మూవీ**
- **సిన్నర్‌స్‌కు నాలుగు అవార్డులు**
- **బెస్ట్ యాక్టర్‌గా మిచెల్ బి.జోర్డాన్**
- **బెస్ట్ డైరెక్టర్‌గా పాల్ థామస్ ఆండర్సన్**
- **ఆస్కార్ స్టేజ్‌పై ప్రియాంక చోప్రా సందడి**
- **నామినేషన్లతోనే సరిపెట్టుకున్న భారతీయ సినిమాలు**

**ముద్ర డెస్క్:**

ప్రపంచ సినీ రంగంలో అత్యున్నత పురస్కారంగా భావించే ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సం అట్టహాసంగా జరిగింది. 98వ అకాడెమీ అవార్డ్స్ వేడుకల్లో హాలీవుడ్ తో పాటు వివిధ దేశాల సినీ స్టార్స్ సందడి చేశారు. ఇండియా నుంచి ప్రియాంక చోప్రా అకాడెమీ స్టేజ్ పై ప్రజెంటర్ గా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు.

**వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ :**

98వ అవార్డ్స్ లిస్టులో హాలీవుడ్ మూవీ వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సత్తా చాటింది. ఏకంగా ఆరు అవార్డులతో టాప్ లో నిలిచింది. ఈ సినిమాను డైరెక్టర్ పాల్ థామస్ ఆండర్సన్ బెస్ట్ డైరెక్టర్ అవార్డు అందుకున్నారు. దీంతో పాటు ఈ సినిమాకు బెస్ట్ పిక్చర్, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్, బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, బెస్ట్ ఫిలిం ఎడిటింగ్, బెస్ట్ క్యాస్టింగ్ కింద ఆరు అవార్డులు గెలుచుకుని టాప్ లో నిలిచింది.

**సిన్నర్స్ కు నాలుగు అవార్డులు:**

సిన్నర్స్ మూవీ నాలుగు అవార్డులను గెలుచుకుంది. బెస్ట్ యాక్టర్ గా మిచెల్ బి.జోర్డాన్ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే, సినిమాటోగ్రఫీ, ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో అవార్డులు గెలుచుకుంది.

**ఆస్కార్ అవార్డులు 2026**

**ఉత్తమ చిత్రం:** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ దర్శకుడు:** పాల్ థామస్ ఆండర్సన్ వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ నటుడు:** మిచెల్ బి.జోర్డాన్, సిన్నర్స్
**ఉత్తమ నటి:** జెసీ బక్లీ - హామ్‌నెట్
**ఉత్తమ సహాయ నటుడు:** షాన్ పెన్ - వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ సహాయ నటి:** ఏమీ మాడిగన్ - వెపన్స్
బెస్ట్ ఒరిజిన స్క్రీన్‌ప్లే: పాపులు - ర్యాన్ కూగ్లర్
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ -సిన్నర్స్, ర్యాన్ కూగ్లర్
**బెస్ట్ సినిమాటోగ్రఫీ:** సిన్నర్స్ - ఆటం డ్యూరాల్డ్ అర్కాపా
**బెస్ట్ ఎడిటింగ్: -** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ - ఆండీ జుర్గెన్సెన్
**బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్:** ఫ్రాంకెన్‌స్టైన్
**కాస్ట్యూమ్స్:** ఫ్రాంకెన్‌స్టైన్ - కేట్ హాలీ
**విజువల్ ఎఫెక్ట్స్:** అవతార్: ఫైర్ అండ్ యాష్
**బెస్ట్ సౌండ్:** ఎఫ్1
**ఉత్తమ కాస్టింగ్:** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ - కాసాండ్రా కులుకుండిస్
**బెస్ట్ ఒరిజినల్ స్కోర్:** సిన్నర్స్ - లుడ్విగ్ గోరాన్సన్
**ఉత్తమ పాట:** గోల్డెన్ - కేపాప్ డెమాన్ హంటర్స్
**ఉత్తమ అంతర్జాతీయ చిత్రం:** సెంటిమెంటల్ వ్యాల్యూ (నార్వే)
**ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం:** మిస్టర్. నోబడీ అగెనిస్ట్ పుతిన్
**ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం:** ఆల్ ద ఎంప్టీ రూమ్స్
**ఉత్తమ యానిమేషన్ చిత్రం:** కెపాప్ డెమాన్ హంటర్స్
**ఉత్తమ యానిమేషన్ షార్ట్ ఫిలిం:** ద గర్ల్ హూ క్రైడ్ పెరల్స్
**ఉత్తమ లైవ్-యాక్షన్ షార్ట్ ఫిలిం**: ద సింగర్స్

భారతీయ సినిమాలు ఈసారి నిరాశపర్చాయి. గీతా గబ్బర్ తీసిన రెండు సినిమాలు నామినేట్ అయినప్పటికీ వాటికి అవార్డు దక్కలేదు.
బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ : ద పర్ఫెక్ట్ నెయిబర్
బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం : ద డెవిల్ ఈజ్ బిజీ సినిమాలు నామినేట్ అయ్యాయి. ఒకే ఏడాదిలో రెండు డాక్యుమెంటరీ చిత్రాలు నామినేట్ అయిన ఇండియా మహిళా డైరెక్టర్ గీతా గబ్బర్ కావడం విశేషం.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడి ఆపాలి

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్ బోస్**

**ముద్ర, కాప్రా:**




సామ్రాజ్యవాద దురాక్రమనే లక్ష్యంగా ప్రమాదకరకంగా అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ , ఇజ్రాయిల్ దేశ అధ్యక్షుడు నేతన్యాహు జియోనిస్ట్ కూటమి వ్యవహరిస్తూ ఇరాన్‌పై దాడి చేయడం అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన అని, తక్షణమే యుద్ధాన్ని ఆపి, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ అన్నారు. సోమవారం సీపీఐ అధ్వర్యంలో మల్లాపూర్ లో ప్లకార్డులు చేతబూని నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి, మానవత్వం కోసం యుద్ధం కాకుండా చర్చలు, రాజదౌత్యం మాత్రమే మార్గమని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించిందన్నారు. అయినప్పటికీ ప్రపంచంలోని సామ్రాజ్యవాద శక్తులు అమెరికా, ఇజ్రాయిల్ తమ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు మధ్యప్రాచ్య దేశాలను యుద్ధ వేదికగా మార్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇరాన్‌పై యుద్ధ వాతావరణం సృష్టించడం కూడా అదే విధమైన ప్రమాదకర ధోరణికి నిదర్శనమన్నారు. యుద్ధం ఎప్పటికీ సాధారణ ప్రజలకు మేలు చేయదని, యుద్ధం వల్ల కార్మికులు, రైతులు, పేద ప్రజలు, మహిళలు మరియు పిల్లలే అత్యంత భయంకరమైన నష్టాన్ని ఎదుర్కొంటారన్నారు. గతంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో జరిగిన యుద్ధాల వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కోట్లాది మంది తమ నివాసాలను వదిలి వలస బాట పట్టాల్సి వచ్చిందని . అలాంటి విషాదకర పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకూడదన్నారు. ప్రపంచ దేశాల మధ్య ఉన్న విభేదాలను యుద్ధం ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నించడం అంతర్జాతీయ శాంతికి తీవ్రమైన ముప్పు అని . ఆయుధ శక్తి ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం ప్రపంచాన్ని మరింత అస్థిరత వైపు నడిపిస్తుందన్నారు. అందుకే సమస్యల పరిష్కారానికి చర్చలు, పరస్పర గౌరవం, అంతర్జాతీయ చట్టాల పాటింపు అవసరమన్నారు. ఇరాన్ పై యుద్ధం జరుగుతుంటే మన దేశ ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత విదేశాంగ విధానంలో లోతైన సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. డొనాల్డ్ ట్రంప్ నిర్దేశించిన అనుమతి సమయపాలనకు లోబడి రష్యాతో భారతదేశం యొక్క చమురు వాణిజ్యం అవమానకరమైన పరిస్థితితో సహా వాషింగ్టన్ నుంచి వచ్చే ఒత్తిడికి సమర్థవంతంగా తలవంచడం ద్వారా ప్రభుత్వం దేశం యొక్క సార్వభౌమ నిర్ణయాధికారంలో రాజీ పడిందన్నారు . ఇటువంటి విధేయతతో కూడిన దౌత్యం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై భారతదేశం యొక్క చారిత్రాత్మక నిబద్ధతను బలహీనపరుస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జి. దామోదర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. ధర్మేంద్ర, సిపిఐ సీనియర్ నాయకులు టి. మల్కయ్య, సిపిఐ ఉప్పల్ మండల్ కార్యదర్శి టీ. సత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మమతకు ఈసీ షాక్..

**ముద్ర, డెస్క్:**

అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం మమతా బెనర్జీ సర్కార్‌కు షాక్ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని పోలీస్, బ్యూరోక్రసీలో కీలక అధికారులను బదిలీ చేసింది. ప్రస్తుతం డీజీపీ, ప్రధాన కార్యదర్శులను తొలగించి, ఆ పదవుల్లో కొత్త అధికారులను నియమించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి దుష్యంత్ నారియాలా, నందిని చక్రవర్తి స్థానంలో ప్రధాన కార్యదర్శిగా, పీయూష్ పాండే స్థానంలో ఉన్నత పోలీసు అధికారి సిద్ధ్ నాథ్ గుప్తా డీజీపీగా నియమితులయ్యారు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌తో సహా మరో ముగ్గురు సీనియర్ అధికారులను కూడా ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది.
కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అస్సాంలకు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఒక రోజు తర్వాత, ఎన్నికల సంఘం బెంగాల్‌లో కీలక అధికారులను బదిలీ చేసింది. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిద్ధ్ నాథ్ గుప్తాను పశ్చిమ బెంగాల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా నియమించారు. గుప్తా 30 ఏళ్ల కెరీర్‌లో కీలక స్థానాల్లో విధులు నిర్వహించారు. నందిగ్రామ్ అల్లర్లు, లాల్‌గఢ్ నక్సల్స్ ఉద్యమం, డార్జిలింగ్ గోర్ఖాలాండ్ ఆందోళన సమయంలో ఆయన శాంతిభద్రతల్ని సమర్థవంతంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మతపరమైన అల్లర్లను అదుపు చేయడంతో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. మరోవైపు, సీనియర్ అధికారి అజయ్ కుమార్ నంద్, సుప్రతీమ్ సర్కార్ స్థానంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు. అజయ్ ముకుంద్ రనడే అదనపు డైరెక్టర్ జనరల్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (శాంతిభద్రతలు) గా నియమితులయ్యారు. బదిలీ అయిన అధికారులను ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి ఎన్నికల విధుల్లో నియమించొద్దని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని, సంబంధిత అధికారులు మధ్యాహ్నం 3 గంటల లోపు బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోలీస్ అధికారులతో పాటు సీఎస్ నందిని చక్రవర్తి స్థానంలో దుష్యంత్ నరియాలా కొత్త ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. సంఘమిత్ర ఘోష్‌ను హోం అండ్ హిల్ అఫైర్స్ ప్రధాన కార్యదర్శిగా నియమించాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతను సమీక్షించిన తర్వాతే, ఈ ఇద్దరు అధికారులను బాధ్యతల నుండి తప్పించే నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23 మరియు 29 తేదీల్లో జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.




# 'జల వనిత' గా తెగలపల్లి ఆనంద ఎంపిక

- **కేంద్ర జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద**
- **జిల్లా మహిళకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు**
- **ఆనందను సన్మానించిన కలెక్టర్ నారాయణరెడ్డి**


**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:**


రంగారెడ్డి జిల్లా అమన్ గల్ మండలం చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన తెలగమల్ల ఆనంద 'జల వనిత' (వాటర్ ఉమెన్)గా ఎంపికయ్యారు. 'జల్ జీవన్ మిషన్' కార్యక్రమం అమలులో ఆమె చేసిన కృషికి గాను ఎంపిక చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 'జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం 2026లో తెలగమల్ల ఆనంద పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. జల మహోత్సవ్ కార్యక్రమం కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం ముగ్గురు మహిళా సర్పంచులు, ముగ్గురు 'జల వనితలు', ముగ్గురు స్వయం సహాయక బృందాల మహిళలు ఎంపికయ్యారు. ఎంపికైన ఆ ప్రతినిధులలో రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలగమల్ల ఆనంద ఒకరు కాగా జల్ జీవన్ మిషన్ అమలులో ఆనంద చేసిన విశేష కృషిని కేంద్ర జల మిషన్ శాఖ గుర్తించి ఆమెను జల వనితగా ఎంపిక చేయడం పట్ల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చిన ఆమెను అభినందిస్తూ సోమవారం కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

వడ్డీ రేట్లు :
ఇండియన్ బ్యాంక్
FDపై సుమారు 6.40% వరకు వడ్డీ. సీనియర్ సిటిజన్లకు 6.95% వరకు లభిస్తుంది.




# అది దేశ ప్రజల నెత్తురు..
# సన్ రైజర్స్ పై సునీల్ గవాస్కర్ ఫైర్





**ముద్ర డెస్క్ :**
ది హండ్రెడ్ క్రికెట్ లీగ్ టోర్నీలో సన్ రైజర్స్ లీడ్స్ జట్టుకు కావ్య మారన్ యజమానిగా వ్యవహరిస్తోంది. ఈ జట్టు యాజమాన్యం ఇటీవల పాకిస్తాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్ ను జట్టులోకి తీసుకుంది. దీంతో దుమారం మొదలైంది. ఒకానొక దశలో ఐపీఎల్ నుంచి హైదరాబాద్ జట్టును బహిష్కరించాలని డిమాండ్ కూడా వ్యక్తం అయింది. మాజీ క్రికెటర్లు.. క్రికెట్ విశ్లేషకులు కావ్య మారన్ తీసుకొన్న నిర్ణయం పట్ల తీవ్ర స్థాయిలో అగ్రహారం వ్యక్తం చేశారు. కావ్య మారన్ వ్యవహరించిన తీరు పట్ల ఇప్పుడు మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించారు. కావ్య అబ్రార్ అహ్మద్ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "2008 నుంచి ఐపీఎల్ లో పాకిస్తాన్ ప్లేయర్లను నిషేధించాం. ముంబై ప్రాంతంలో జరిగిన పేలుళ్లకు ప్రధాన కారణం పాకిస్థాన్ ఉగ్రవాదులు. దీని వెనుక పాకిస్తాన్ దేశం హస్తముంది. పాకిస్తాన్ తీరువల్ల మన దేశం తీవ్రంగా నష్టపోయింది. అప్పటినుంచి పాకిస్తాన్ ప్లేయర్లను ipl లో ఆడించడం లేదు. పాకిస్తాన్ ప్లేయర్లకు ఫీజు చెల్లించడమంటే అది భారతీయుల రక్తం నుంచి సేకరించిందని గుర్తించుకోవాలని" సునీల్ గవాస్కర్ తీవ్రస్వరంతో హెచ్చరించారు. "ఆ టోర్నీ అనేది ఇతర దేశానికి సంబంధించినది అయినప్పటికీ.. అందులో మన దేశ ప్రజలకు సంబంధించిన వాటా ఉంటుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి అందులో వాటా ఉంది కాబట్టి కచ్చితంగా మన దేశ ప్రజలు ఆ లీగ్ చూస్తూనే ఉంటారు. తద్వారా పరోక్షంగా ఆదాయం రావడానికి కృషి చేస్తూనే ఉంటారు. అలాంటప్పుడు అహ్మద్ లాంటి ఆటగాడికి చెల్లించేది భారతీయుల సొమ్మే కదా" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు సన్ రైజర్స్ లీడ్స్ జట్టు కోచ్ వెటోరి మీద కూడా సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. "కోచ్ వెటోరి ఈ వ్యవహారం గురించి వేరే విధంగా మాట్లాడుతూ ఉండవచ్చు. అయితే అసలు విషయాలు అతడికి తెలియదు. యజమాన్యం పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ కొన్ని రకాల భావోద్వేగాలను గుర్తించాలి. మేనేజ్మెంట్ సూచన మేరకు అహ్మద్ ను జట్టులోకి తీసుకున్నప్పటికీ.. భారతీయుల మనోభావాల కంటే ఈ టోర్నీలో గెలవడం ముఖ్యమా" అని గవాస్కర్ ప్రశ్నించారు. మరోవైపు అహ్మద్ ను జట్టులోకి తీసుకున్న తర్వాత కెప్టెన్ వెటోరి విలేకరులతో మాట్లాడారు. వాస్తవానికి తాము ఇంగ్లాండ్ స్పిన్ బౌలర్ రషీద్ ను తీసుకోవాలని అనుకున్నామని.. కానీ అహ్మద్ ను తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. మధ్యలో తారీక్ ఉస్మాన్ కోసం కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసినట్టు వివరించారు.



# విమర్శలను జయించి మెరిసిన ఇషాన్ కిషన్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
జట్టులో స్థానం కోల్పోయినా వెనక్కు తగ్గకుండా శ్రమతో తిరిగి జట్టులోకి వచ్చిన బ్యాటర్ ఇషాన్ కిషన్. టీ20 ప్రపంచకప్‌లో దూకుడు ఆటతో అభిమానులను అలరించాడు. గతంలో కొన్ని వివాదాల కారణంగా జట్టుకు దూరమైన అతడు దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేసి మళ్లీ టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో వేగంగా పరుగులు చేసి ఒక సెంచరీ నమోదు చేశాడు. ఆ ఫామ్‌తోనే ప్రపంచకప్‌లో అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. టోర్నీలో తొమ్మిది మ్యాచ్‌ల్లో 317 పరుగులు చేసి భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఓపెనర్‌గా, వన్‌డౌన్‌లో జట్టు అవసరానికి అనుగుణంగా ఆడుతూ కీలక పాత్ర పోషించాడు. స్పిన్నర్లు, పేసర్లపై దూకుడుగా ఆడుతూ తన ఆటలో స్పష్టమైన మార్పు చూపించాడు. రాబోయే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అతడు బరిలోకి దిగనున్నాడు.

# గేల్ రికార్డులు బద్దల కొడతా..

- **తొడగొట్టిన వైభవ్ సూర్యవంశీ**




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీపై మరోసారి అభిమానుల దృష్టి నిలిచింది. గతేడాది చిన్న వయసులోనే లీగ్‌లో అడుగుపెట్టి తన దూకుడు ఆటతో ఆకట్టుకున్న అతడు అండర్-19 వరల్డ్ కప్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ ఏడాది కూడా అదే ఫామ్ కొనసాగిస్తే జాతీయ జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.
తాజాగా జరిగిన ఓ చిట్ చాట్‌లో మాట్లాడిన వైభవ్ తన ప్రధాన లక్ష్యం రాజస్థాన్ రాయల్స్‌కు టైటిల్ అందించడమేనని తెలిపాడు. అలాగే ఐపీఎల్‌లో క్రిస్ గేల్ చేసిన 175 పరుగుల రికార్డును అధిగమించాలనే ఆశ కూడా ఉందని చెప్పాడు. అయితే తాను ఎప్పుడూ ఆటపైనే దృష్టి పెడతానని, బయట జరిగే చర్చలను పట్టించుకోనని స్పష్టం చేశాడు.
బీసీసీఐ నిర్వహించిన నమన్ అవార్డుల కార్యక్రమంలో వ్యాఖ్యాత హర్షా భోగ్లే అడిగిన ప్రశ్నకు స్పందించిన వైభవ్, ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టడం లేదా వేగవంతమైన సెంచరీ కంటే గేల్ 175 పరుగుల రికార్డును అధిగమించడం తనకు పెద్ద లక్ష్యమని పేర్కొన్నాడు.




## టీ20లకే నేను సరిపోయా: సూర్యకుమార్ యాదవ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెస్టుల్లో ఎందుకు ఎక్కువగా ఆడలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లోనే తనకు ఎక్కువ సౌకర్యంగా అనిపిస్తోందని చెప్పారు.
టెస్టుల్లో తాను కేవలం ఒకే ఒక్క ఇన్నింగ్స్ మాత్రమే ఆడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టీ20ల్లోనే ఎక్కువ మ్యాచ్‌లు ఆడుతూ ఆ ఫార్మాట్‌లో స్థిరపడ్డానని వెల్లడించారు. టీ20ల్లో ఆడటం తనకు ఎంతో అనుకూలంగా ఉందని తెలిపారు.
క్రికెట్ ప్రారంభంలో తాను రెడ్‌బాల్ క్రికెట్‌తోనే కెరీర్ ప్రారంభించానని సూర్య చెప్పారు. దాదాపు పదేళ్లు రంజీ ట్రోఫీలో ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించానని వివరించారు. భారత్‌లో ఎక్కువ మంది క్రికెటర్లు రెడ్‌బాల్ క్రికెట్‌తోనే కెరీర్ మొదలుపెడతారని తెలిపారు. తర్వాత పరిమిత ఓవర్ల క్రికెట్ వైపు వచ్చినప్పుడు టీ20 ఫార్మాట్ తనకు బాగా సరిపోయిందని చెప్పారు. టెస్టు క్రికెట్‌పై ప్రేమ లేదని మాత్రం చెప్పలేనని స్పష్టం చేశారు.
వన్డే క్రికెట్‌లో మూడు విధాలుగా ఆడాల్సి ఉంటుందని సూర్య వివరించారు. ప్రారంభంలో వికెట్లు పడితే టెస్టు తరహాలో నెమ్మదిగా ఆడాల్సి ఉంటుందని, మధ్య ఓవర్లలో స్ట్రైక్‌రేట్ పెంచాల్సి ఉంటుందని చెప్పారు.

## టీమిండియా ఒక వ్యక్తిది కాదు..
# దేశ ప్రజలందరిది

- **రోహిత్, కోహ్లీతో విభేదాలపై గంభీర్ స్పందన**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మధ్య సంబంధాలపై కొనసాగుతున్న చర్చలకు ఆయన పరోక్షంగా స్పందించారు. కోల్‌కతాలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో మాట్లాడిన గంభీర్ తన నిర్ణయాలు, విమర్శలపై అభిప్రాయాలు వెల్లడించారు.
కోచ్‌గా ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజమని గంభీర్ తెలిపారు. గత 18 నెలల్లో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా వాటిపై ఎక్కువగా ఆలోచించనని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తనపై, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై వచ్చే ప్రతి వ్యాఖ్యకు స్పందించడం తన పని కాదన్నారు.
భారత జట్టు ఒక్క వ్యక్తిదే కాదని, డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ఆటగాళ్లతో పాటు దేశ ప్రజలందరిదని గంభీర్ వ్యాఖ్యానించారు. మంచి ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు కొన్నిసార్లు విఫలం కావచ్చని చెప్పారు. అయితే చెడు ఉద్దేశంతో తీసుకునే నిర్ణయాలు మాత్రం డ్రెస్సింగ్ రూమ్‌లో ఎప్పటికీ అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. పని విషయంలో తాను నిజాయితీగా ఉంటానని, తన తప్పు లేనప్పుడు కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడనని అన్నారు.
న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఓటముల తర్వాత బీసీసీఐ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మలను సమీక్షకు పిలిచిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆటగాళ్ల వ్యక్తిగత స్వేచ్ఛపై కొన్ని నియమాలు అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని గంభీర్ సమర్థించగా రోహిత్ శర్మ వ్యతిరేకించినట్లు వార్తలు వచ్చాయి.
ఆ తర్వాత కొంతకాలానికే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. రోహిత్ వైదొలిగిన తర్వాత టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు శుభ్‌మన్ గిల్‌కు అప్పగించారు. ప్రస్తుతం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. 2027 వన్డే ప్రపంచకప్ తర్వాత ఈ ఇద్దరూ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.





## ఐపీఎల్ మ్యాచ్‌లకు
# కర్ణాటక ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్


**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న IPL మ్యాచ్‌ల నిర్వహణకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. భద్రతా ఏర్పాట్లు, సంసిద్ధత చర్యలపై నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం సోమవారం విధాన సౌధలో హోం మంత్రి జి. పరమేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు హోమ్ మ్యాచ్‌లకు చిన్నస్వామి స్టేడియం వేదికగా ఉండనుంది. ఈ మైదానంలో ఆర్సీబీ ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. అలాగే రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉన్న రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మరో రెండు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.
ఈ సీజన్‌లో IPL ప్లేఆఫ్ మ్యాచ్‌లలో ఒకటి, ఫైనల్ పోటీ కూడా బెంగళూరులో జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని జస్టిస్ కున్హా కమిటీ సూచనల మేరకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ పలు భద్రతా చర్యలు చేపట్టింది.
చిన్నస్వామి స్టేడియంలో గరిష్టంగా 35 వేల మంది ప్రేక్షకులకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. మ్యాచ్ రోజున రద్దీ తగ్గించేందుకు పోటీ ప్రారంభానికి మూడు నుంచి నాలుగు గంటల ముందే స్టేడియం గేట్లు తెరవనున్నారు. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. టికెట్ ఉన్న ప్రేక్షకులకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ సహకారంతో మెట్రో రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17.03.2026
www.mudranews.in | @mudranews



### తెలుగులో విడుదలైన మొట్టమొదటి టాకీ సినిమా

తెలుగులో విడుదలైన మొట్టమొదటి టాకీ సినిమా భక్త ప్రహ్లాద. దీనిని ప్రముఖ దర్శకుడు హెచ్ .ఎం.రెడ్డి తెరకెక్కించారు. 1932లో విడుదలైన ఈ చిత్రం తెలుగు సినిమా పరిశ్రమకు శ్రీకారం చుట్టి, తరువాత వచ్చిన ఎన్నో చిత్రాలకు మార్గదర్శకంగా నిలిచింది.






### ఆస్కార్ 'ఇన్ మెమోరియం'లో
## భారతీయ దిగ్గజాలకు నివాళి

అద్భుతమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించి, గత ఏడాదిలో తుదిశ్వాస విడిచిన సినీ దిగ్గజాలను ఆస్కార్ వేదికపై స్మరించుకున్నారు. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో 'ఇన్ మెమోరియం' అనే ప్రత్యేక విభాగం ద్వారా ప్రపంచ సినీ రంగానికి విశేష సేవలు చేసిన కళాకారులకు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా హాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులతో పాటు ప్రపంచవ్యాప్తంగా సినీ పరిశ్రమలో గొప్ప కృషి చేసిన కళాకారుల పేర్లను అకాడమీ ప్రస్తావించింది. భారతీయ సినీ రంగం నుంచి కూడా పలువురు దిగ్గజాల పేర్లు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ముఖ్యంగా ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి. సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి ప్రముఖుల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది.

వేడుక ప్రారంభంలో గత ఏడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులను స్మరించుకుంటూ ఒక ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. ఆ వీడియోలో వారి సినీ ప్రయాణాన్ని చూపిస్తూ నివాళులు అర్పించారు. అయితే ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా పలువురు దీనిపై స్పందిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ అంశంపై హాలీవుడ్ మీడియా స్పందిస్తూ సమయాభావం కారణంగా వీడియోలో కొంతమంది ప్రముఖులను మాత్రమే చూపించారని తెలిపింది. అయితే మరణించిన అందరి కళాకారుల పేర్లను అకాడమీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వివరించింది.

89 ఏళ్ల వయసులో గత ఏడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. భారతీయ సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారంతో ఆయనను సత్కరించింది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు సినిమాల్లో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన కోట శ్రీనివాసరావు గత ఏడాది జూలై 13న కన్నుమూశారు. వారి సేవలను సినీ ప్రపంచం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.



# ఆస్కార్ వేదికపై మెరిసిన ప్రియాంక చోప్రా

ప్రపంచ సినీ రంగం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఆస్కార్ అవార్డుల వేడుక ఈసారి కూడా అంగరంగ వైభవంగా జరిగింది. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలోని ప్రసిద్ధ డాల్బీ థియేటర్ వేదికగా జరిగిన 98వ అకాడమీ అవార్డ్స్ కార్యక్రమం సినీ ప్రముఖుల సందడితో కళకళలాడింది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నటీనటులు, దర్శకులు, సినీ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకకు హాలీవుడ్ కు చెందిన ప్రముఖ కమెడియన్ కోనన్ ఓబ్రియన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తన సరదా వ్యాఖ్యలతో కార్యక్రమాన్ని ఆసక్తికరంగా నడిపిస్తూ ప్రేక్షకులను అలరించారు. రెడ్ కార్పెట్ పై సెలబ్రిటీల గ్లామర్ లుక్స్ కూడా అందరి దృష్టిని ఆకర్షించాయి.

ఈ సందర్భంగా భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ఆస్కార్ వేదికపై సందడి చేశారు. ఆమె ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి సంబంధించిన అవార్డును అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియాంక చోప్రా ఆస్కార్ వేదికపై కనిపించడం భారతీయ అభిమానులకు గర్వకారణంగా మారింది.

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ విజయవంతమైన ప్రయాణం సాగిస్తున్న ప్రియాంక చోప్రా ప్రపంచ స్థాయి వేదికపై అవార్డు అందజేయడం మరోసారి భారతీయ ప్రతిభను ప్రతిబింబించింది. ఆమె వేదికపై కనిపించిన క్షణాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి.



### ఆస్కార్‌లో ఆరు అవార్డులు గెలిచిన
## 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'

బలమైన కథ, భావోద్వేగాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రం ఈ ఏడాది ఆస్కార్ అవార్డుల్లో సత్తా చాటింది. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఆరు ఆస్కార్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన పాల్ థామస్ అండర్సన్ ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. ప్రముఖ నటుడు లియోనార్డో డికాప్రియో ఇందులో కీలక పాత్రలో నటించారు. 2000లో వచ్చిన 'వైన్‌లాండ్' నవల ఆధారంగా రూపొందిన ఈ సినిమా తండ్రి–కూతురు మధ్య ఉన్న భావోద్వేగ బంధాన్ని ప్రధానంగా చూపిస్తుంది. ఒంటరి తండ్రిగా తన కుమార్తెను పెంచే వ్యక్తి ఎదుర్కొనే కష్టాలు, ఆమెను రక్షించేందుకు చేసే పోరాటం కథలో ప్రధానాంశంగా నిలుస్తుంది.

సుమారు 130 నుంచి 175 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 209.6 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు సాధించకపోయినా విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

తాజా ఆస్కార్ అవార్డుల్లో ఈ చిత్రం మొత్తం 13 విభాగాల్లో నామినేషన్లు సాధించింది. అందులో ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆరు అవార్డులు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సినిమా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌లో అందుబాటులో ఉంది.

## సిల్క్ చీరలో శ్రీలీల గ్లామర్ మెరుపులు

టాలీవుడ్‌లో తన అందం, చురుకైన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యువ నటి శ్రీలీల మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె నటించిన భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతున్న వేళ, సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన తాజా ఫోటోలు అభిమానుల దృష్టిని కట్టిపడేశాయి.

ఈ ఫోటోల్లో శ్రీలీల విన్టేజ్ స్టైల్‌తో కూడిన క్లాసిక్ లుక్‌లో కనిపించింది. ఆమె ధరించిన ఆలివ్ గ్రీన్ రంగు సిల్క్ చీర ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. చీర అంచులపై నాజూకైన బంగారు జరీ పనితో పాటు లోపల కనిపించే పింక్ కలర్ లైనింగ్ ఆ డ్రెస్‌కు మరో అందాన్ని జోడించింది. సంప్రదాయ చీరను ఎంతో అందంగా డ్రేప్ చేసుకున్న శ్రీలీల లుక్‌లో ఒక రాజసంగా కనిపించే ఆకర్షణ స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఆమె మినిమల్ మేకప్‌తో పాటు సింపుల్ జ్యువెలరీని ఎంచుకోవడం ఈ లుక్‌కు మరింత ఎలిగెంట్ టచ్ ఇచ్చింది. జుట్టును సాఫ్ట్ స్టైల్‌లో సెట్ చేసుకుని, స్మైల్‌తో కెమెరాకు పోజులిచ్చిన శ్రీలీల ఫోటోలు అభిమానుల్లో మంచి స్పందనను తెచ్చుకుంటున్నాయి. క్లాసిక్ సౌందర్యం మరియు ఆధునిక గ్లామర్ రెండింటినీ కలిపిన ఈ లుక్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

ఇక 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో ఆమె గీత అనే పాత్రలో నటిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన ఆమె కనిపించబోతుండటంతో ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా విడుదలకు ముందే శ్రీలీల షేర్ చేసిన ఈ విన్టేజ్ సిల్క్ చీర ఫోటోలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.





## ఆస్కార్ వేదికపై అరుదైన 'టై'.. ఇద్దరు విజేతలు

ప్రపంచ సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన ఆస్కార్ వేడుకలో ఈసారి అరుదైన సంఘటన చోటుచేసుకుంది. బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఇద్దరు విజేతలు ఎంపిక కావడంతో ఆస్కార్ చరిత్రలో మరోసారి 'టై' నమోదైంది. 98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో ఇది ఏడోసారి జరగడం విశేషం. విజేతల పేర్లు ప్రకటించేందుకు వేదికపైకి వచ్చిన నటుడు కుమాయిల్ నంజియాని ఎన్వలప్ తెరిచి కొద్దిసేపు మాట్లాడకుండా ఉండడంతో హాల్ అంతా నిశ్శబ్దంగా మారింది. అనంతరం ఈ కేటగిరీలో రెండు చిత్రాలు సమాన ఓట్లు సాధించాయని ప్రకటించారు. దీంతో డాల్బీ థియేటర్ చప్పట్లతో మారుమోగింది. ఈ విభాగంలో 'ది సింగర్స్', 'టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు విజేతలుగా నిలిచాయి.

ఈ సందర్భంగా నంజియాని సరదాగా 'ఒక షార్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వడానికి రెట్టింపు సమయం పడుతోంది' అని వ్యాఖ్యానించగా, హోస్ట్ కోనన్ ఓబ్రియన్ కూడా 'ఈ టై వల్ల ఆస్కార్ బెట్టింగ్ చేసిన వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో' అంటూ చమత్కరించారు. ఆస్కార్ చరిత్రలో ఇంతకు ముందు కూడా కొన్ని సందర్భాల్లో టైలు నమోదయ్యాయి. ముఖ్యంగా 2012లో ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ విభాగంలో 'స్కైఫాల్', 'జీరో డార్క్ థర్టీ' చిత్రాలు సంయుక్తంగా అవార్డు అందుకున్నాయి.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com